మంగళవారం
TUESDAY
16.09.2025
సంచిక(ISSUE) : 27
సంపుటి(VOLUME) : 17
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

# ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక



### శ్రీకృష్ణుడి మాట

*బలవంతులలోని కామరాగరహితమైన బలమును, ధర్మసిద్ధాంత ములకు విరుద్ధం కానటువంటి కామ సంభోగమును నేనే అయియున్నాను.*

### ముహూర్తం

16 సెప్టెంబర్ 2025 – మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం – వర్ష ఋతువు భాద్రపద మాసం – కృష్ణపక్షం సూర్యోదయం – ఉ. 6:07 సూర్యాస్తమయం – సా. 6:13తిథి దశమి రా. 12:24+ వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఆరుద్ర ఉ. 6:44 వరకు తరువాత పునర్వసు యోగం వారియ రా. 12:30+ వరకు కరణం వనిజ మ. 12:56 వరకు విష్టి రా. 12:24+ వరకు వర్జ్యం సా. 6:36 నుండి రా. 8:11 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:21 వరకు రా. 10:59 నుండి రా. 11:47 వరకు రాహుకాలంమ. 3:12 నుండి సా. 4:43 వరకు యమగండం ఉ. 9:09 నుండి ఉ. 10:40 వరకు గుళికాకాలం మ. 12:10 నుండి మ. 1:41 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు తె. 4:03 నుండి తె. 5:37 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:35 వరకు గమనిక: "+" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

# వీధి దీపాలకు సోలార్ పవర్



సాధ్యాసాధ్యాల పరిశీలన
ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు

పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ
అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

**వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు**

హైదరాబాద్,సెప్టెంబరు15 : ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు

- మిగతా 2వ పేజీలో




## వక్ఫ్ బోర్డులో ముస్లింల సంఖ్య మెజారిటీలో ఉండాలి

వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకీలక ఆదేశాలు
పలు సవరణల్లో ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు
చట్టసవరణను నిలిపివేయాలన్న పిటిషన్లపై విచారణ

న్యూఢిల్లీ,సెప్టెంబరు15 : వక్ఫ్ సవరణచట్టం2025 లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ) చట్టం2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య

- మిగతా 2వ పేజీలో

## రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది

మాజీ మంత్రి హరీశ్‌రావు



**రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయాయని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు అయి-ఎపోయాయని హరీష్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు వల్ల చాలా సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు.**

*- హైదరాబాద్, సెప్టెంబరు 15*

## బండి సంజయ్‌పై కెటిఆర్ పరువునష్టం దావా



హైదరాబాద్,సెప్టెంబరు15 : కేంద్రమంత్రి బండి సంజయ్‌పై పై భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ నిరాధార వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ కేటీఆర్ ఇటీవల పిటిషన్ వేశారు. తనకు బహిరంగ క్షమాపణతో పాటు రూ.10 కోట్లు చెల్లించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సిటీ సివిల్ కోర్టు సోమవారం విచారణ జరిపింది. డిసెంబర్ 15న ఈ కేసు విచారణకు హాజరు కావాలని బండి సంజయ్‌కు సమన్లు జారీ చేసింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో కమిషన్ల కక్కుర్తి

ఎంఎల్‌సి కవిత



హైదరాబాద్,సెప్టెంబరు15 : ఆడబిడ్డల చదువులను కాంగ్రెస్ కమీషన్ల సర్కారు కాలరాస్తోందని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలను తెలంగాణ ప్రభుత్వం ఎగవేస్తుందని దుయ్యబట్టారు. సోమవారం ఆమె ట్వీట్ చేశారు. 20 శాతం కమీషన్లు ఇస్తేనే రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారని... దీంతో కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయని ఆరోపణలు చేశారు. కమీషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్ లో పెట్టారని, ఇప్పటికే కాలేజీలు నడపలేక యాజమాన్యాలు

- మిగతా 2వ పేజీలో

## నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

మైనర్‌పై లైంగికదాడి కేసులో వ్యక్తికి 21 ఏండ్ల జైలు , 30 వేలు జరిమానా

ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దోషి దోమల రాముకు 21 ఏళ్లు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనపై 2018 ఫిబ్రవరిలో చిట్యాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022 నుంచి నల్గొండ పోక్సో కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

## అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు

అక్రిడేషన్ కార్డులపై విధివిధాలు రూపొందించాలి
అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్,సెప్టెంబరు15 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులం దరికి అక్రిడిటేషన్ కార్డులు

- మిగతా 2వ పేజీలో

## ఆరోగ్యశ్రీ బంద్!?

నేటి అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేత
ప్రభుత్వానికి నెట్‌వర్క్ హాస్పిటల్స్ అల్టిమేటం
1400 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 : రాష్ట్రంలో మరోసారి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.1,400 కోట్ల బకాయిల చెల్లింపు ప్రక్రియలో జాప్యంపై నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదని సమ్మె నిర్ణయం తప్పలేదని వివరించింది. బకాయిల చెల్లింపులు లేకపోవడంతో హాస్పిటల్స్ నడిపించే పరిస్థితి లేదని పేర్కొంటున్నాయి. 'ఎంతో కాలంగా పెండింగ్ బకాయిల చెల్లింపు కోసం ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ బిల్లుల

- మిగతా 2వ పేజీలో

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, rhushinews@gmail.com మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

# ఆరోగ్యశ్రీ బంద్!?

మొదటి పేజీ తరువాయి

విషయాన్ని గుర్తు చేస్తూ తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ తరపున ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు లేఖ కూడా రాశాం. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకపోతే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామనీ తేల్చి చెప్పాం' అని పేర్కొంది. అటు.. గత జనవరిలోనూ ఇదే తరహా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సమయంలో నెట్‌వర్క్ ఆస్పత్రులతో ఆరోగ్యశ్రీ ట్రస్టు చర్చలు జరిపి సుమారు రూ.120 కోట్ల వరకు పెండింగ్ బకాయిలను చెల్లించింది. అయితే ఏడాది కాలంగా ఉన్న పెండింగ్ బకాయిల్లో 45 రోజులకు సంబంధించినవే చెల్లించారని, మిగిలిన వాటిని కూడా ఈ నెలాఖరులోగా చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు డిమాండ్ చేశాయి. కానీ, దీనిపై వైద్యశాఖ నుంచి స్పష్టత రాకపోవడంతో.. అదే రోజు నుంచి సేవలను నిలిపివేశాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నెట్‌వర్క్ ఆస్పత్రులు అద్దెలు చెల్లించే పరిస్థితి కూడా లేదని, వైద్య సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని, ఔషధాలు, సర్జికల్స్ సరఫరాదారులు సైతం వాటి సరఫరా నిలిపివేశారని తెలిపింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పెండింగ్ బకాయులను వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఆరోగ్యశ్రీ బిల్లులను విడుదల చేయాలని కోరింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నెట్ వర్క్ ఆస్పత్రుల తాజా నిర్ణయంపై ప్రభుత్వ నిర్ణయం ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది.

## వక్ఫ్ బోర్డులో ముస్లింల సంఖ్య మెజారిటీలో ఉండాలి

మొదటి పేజీ తరువాయి

కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు ఆక్రణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

## ఫీజురియంబర్స్‌మెంట్లో కమిషన్ల కక్కుర్తి

మొదటి పేజీ తరువాయి

ఆర్థికంగా చితికిపోయాయని వివరించారు. కాలేజీలు మూతపడితే చదువుకు ఆడబిడ్డలు దూరం కానున్నారని ఆవేదని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని గప్పాలు కొట్టి ఆడబిడ్డలను చదువులకు దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



## చిత్ర నిర్మాణ అనుమతులు ఇక మరింత సులవు

### సింగిల్ విండో ద్వారా అనుమతులకు వెబ్‌సైట్

### చిత్రప్రముఖులతో దిల్‌రాజ్ సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్ 15: తెలంగాణా రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణ, సినిమాల చిత్రీకరణల కు కావాల్సిన పలు అనుమతులు, సినిమా థియేటర్ ల నిర్వహణకు పొందాల్సిన అనుమతులు, సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ ఒకే విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్ రూపొందిస్తోంది. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్ సైట్ పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిలిం ఇండస్ట్రీ ప్రతినిధులతో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. బేగంపేట్ టూరిజం ప్లాజా లో జరిగిన ఈ వర్క్ షాప్ కు తెలంగాణా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, తెలంగాణ ఎఫ్.డీ.సీ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎం.డీ వల్లూరు క్రాంతిలతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్.డీ.సి చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాల చేయూతనిస్తున్నారని, ఈ సదావకాశాన్ని సినీ పరిశ్రమ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్ తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వారికి వివిధ శాఖలనుండి కావాల్సిన అనుమతులు, సినీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక విభాగాలు, టెక్నీషియన్లు, హైదరాబాద్ తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లతో పాటు సంపూర్ణ సమాచారంతో ఈ వెబ్ సైట్ రూపొందిస్తున్నామన్నారు. ఒక విధంగా చెప్పాలంటే, ఈవిధమైన సౌలభ్యం మొట్టమొదటిసారిగా తెలంగాణా లో మాత్రమే రూపొందిస్తున్నామని దిల్ రాజు అన్నారు. దీనితోపాటు, సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీఫామ్ జారీ విధానాన్ని కూడా ఆన్ లైన్ ద్వారా పొందే సులభతరం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటివరకు నగరాల్లో అయితే సంబంధిత పోలీసు కమిషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారని, ఇకనుండి ఈ అనుమతులన్నింటినీ ఆన్ లైన్ విధానం ద్వారా జారీచేయడానికి రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ తో చర్చించి విధి విధానాలు రూపొందించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వెబ్‌సైట్ రూపకల్పన కు సంబంధించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా చిత్ర పరిశ్ర ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఆయన కోరారు. ఈ వెబ్ సైట్ ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిలతో ప్రారంభిస్తామని తెలియచేసారు.

# వీధి దీపాలకు సోలార్ పవర్

మొదటి పేజీ తరువాయి

వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి టెండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని



అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్టానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడ మీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐపిఆర్ స్పెషల్ కమిషన ర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హై పవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు వెల్లడించా రు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో



అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జి.ఓ. జారీచేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్దరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉ ంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘం గా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధం పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరం

### ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో అలసత్వం

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి ఆగ్రహం

మంచిర్యాల,సెప్టెంబరు15 :ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం యఅన్నారు. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు



రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా... పేద విద్యార్థుల కోసం రూ.8 వేల కట్టలేరా కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి ఏం చదువుకోవాలి వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా అని మండిపడ్డారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్సుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళ్లు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా ఇందుకోసమేనా కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయని అన్నారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.... అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వం-సగా 3 సార్లు అధికారంలోకి వచ్చినట్లు వెల్లడించారు. నక్సల్స్ చంపింది ఎవరిని పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా మావోయిస్టులను సమర్ధించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా చనిపోయినోళ్లంతా ప్రజలే కదా తెలుగు వాళ్లే కదా అన్నారు. దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి మీరే చెప్పండని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే. అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గు చేటు.రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ఎ÷-లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించుకోరు. నిన్ననే మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం. అసలు కాంగ్రెస్ కు ఎ÷-లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని అడిగితే... కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్ధం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా అని బండి తెలిపారు.

## కవితతో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ

### జూబ్లీహిల్ ఉప ఎన్నికపై మంతనాలు

హైదరాబాద్,సెప్టెంబరు15 : మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీళ్లిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పీజేఆర్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన విష్ణువర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ నుంచి 2008లో నిర్వహించిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2009లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విష్ణు ఓటమి చెందారు. అప్పుడు దివంగత గోపీనాథ్ బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో మ-రోసారి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో చేరినప్పటికీ రాజకీయంగా మాత్రం అంత చురుకుగా ఉ ండటం లేదు. మాగంటి మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న విష్ణును కవిత కలుసుకోవడం ఆసక్తిగా మారింది. వీళ్లిద్దరి మధ్య ఉప ఎన్నికపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. మీటింగ్ తర్వాత బయటికి వచ్చిన విష్ణు మీడియాతో మాట్లాడారు. తాను కేటీఆర్ వెంటే ఉంటానని, పెద్దమ్మ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రమే కవిత ఇంటికి వెళ్లినట్టు చెబుతున్నారు. అనంతరం జరిగిన వెంగళరావ్ నగర్ డివిజన్ సమావేశంలోనూ విష్ణు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో వందేభారత్‌కు హాల్ట్

మంచిర్యాల,సెప్టెంబర్ 15:వందేభారత్ రైలు స్టాపేజీతో మంచిర్యాల జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ స్టాపేజీని కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. పార్లమెంట్‌లో తనకు అవకాశం వచ్చినప్పుడు మొదటి విషయం మంచిర్యాలలో వందేభారత్ ఆపాలని ప్రస్తావించినట్లు ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. రైల్వే అనుసంధానం ద్వారా ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మంత్రి వివేక్ వెల్లడించారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో నిర్వహణ లోపాలతో ఇక్కడి రైతులకు యూరియా ఇబ్బందులు తప్పట్లేవని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణకు అన్ని రకాల నిధులు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు.

# కళాశాలల యాజమాన్యలతో చర్చలు సఫలం

**కళాశాలల యాజమాన్యలతో చర్చలు సఫలం**

**నేటినుంచి యధావిధిగా కాలేజీల ప్రారంభం**

**దీపావళి లోగా 1200 కోట్ల బకాయిల విడుదల**

**గత బిఆర్ఎస్ ఫీజ్ రియంబర్స్‌మెంట్‌ను తుంగలో తొక్కిందన్న భట్టి**



హైదరాబాద్,సెప్టెంబర్ 15: తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు సఫలమయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఫీజురియింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. నాలు గేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవ డాన్ని నిరసిస్తూ వృత్తి విద్యా కళాశాలలు బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. ఫీజురియింబర్స్ మెంట్ అంశంపై మంత్రులు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు ముగిశాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. దీంతో మంగళవారం నుంచి తరగతులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. 'విద్యార్థుల భవిష్యత్తు తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరంలాంటిది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఛిన్నాభి న్నం చేసింది. పదేళ్ల పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను పెండిగ్‌లో పెట్టి భారంగా మార్చింది. వారు విధ్వంసం చేసిన అంశాలను మేం క్రమక్రమంగా సరిదిద్దుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజురియింబర్స్‌మెంట్ సమస్యను కూడా పరిష్కరిస్తాం. ఈ పథకానికి సంబంధించి కళాశాలల వద్ద రూ.600 కోట్ల విలువైన టోకెన్లు ఉన్నాయి. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.600 కోట్ల నిధులు ఈ వారంలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చాం. ఫీజు రియింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం ఒక కమిటీ వేయాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తి మేరకు కళాశాలల బంద్‌ను విరమించుకున్నట్లు యాజమాన్యాలు చెప్పాయి. బంద్ విరమణకు ముందుకొచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలని తెలిపారు.

# భూముల అమ్మకం.. ఆదాయ మార్గాలపై దృష్టి

**రోజురోజుకు పెరుగుతున్న ఖర్చలతో పరేషాన్**

**ఆదాయం సమకూర్చే రంగాలపై ప్రత్యేక ఫోకస్**

హైదరాబాద్,సెప్టెంబర్15: రాయదుర్గంలో భూమి అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో గుర్తించి అమ్ముకోవడం పరిపాటిగా మారింది. గతంలో కెసిఆర్ ఇలాగే చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే చేస్తున్నారు. సంక్షేమం పేరిట దుబారాను ఆపితే కొంతయినా భారం తగ్గుతుంది. కానీ అలా చేయకండా ఉన్న భూములను తెగనమ్ముతున్నారు. కంచగచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో అవి ఆగిపోయాయి. లేకుంటే ఈపాటికే ఫలహారంగా మారేవి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి, అమ్మకాలపైనే దృష్టి సారించారు. ఖర్చులు విపరీతంగా పెరగడం చూస్తున్నాం. ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీలు మూతపడ్డాయి. ఆరోగ్యశ్రీ చెల్లింపులపైనా విమర్శలు వస్తున్నాయి. అయితే భారంగా మారిన పథకాలపై సమీక్షలు చేయడం లేదు. కేవలం ఆదాయాలను ఎలా పెంచుకోవాలన్న దానిపైపే దృష్టి సారించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల ను అమలు చేయాలంటే నిధులు అవసరం. దీంతో ఆదాయ వనరులను పెంచుకుని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రధానంగా కమర్షియ ల్ ట్యాక్స్, ఎక్సైజ్, గనులు, రిజిస్ట్రేషన్ల శాఖలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.. ఆదాయ వనరుల సమీకరణ, లక్ష్యాల పై ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. లక్ష్య సాధనకు అన్ని శాఖలు పక్కా ప్రణాళికల తో ముందుకు సాగాలని సబ్ కమిటీ అధికారులకు సూచించింది. ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమైంది. కెసిఆర్ హయాంలో ఆజామాబాద్, నాచారం, ఉప్పల్ పారిశ్రామిక వాడలను తరలించి అక్కడ ఉన్న భూములను టెండర్ పెట్టాలని చూశారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న జిల్లాల్లో నూతనంగా పారిశ్రామికవాడల ఏర్పాటుకు సర్కారు యోచిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో, పలు ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉంది. జిల్లా పరిధిలో హైదరాబాద్ విజయవా (65), హైదరాబా ద్భూపాలపల్లి(163) జాతీయ రహదారులు ఉండటంతో పాటు సమీపంలోనే రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కూడా అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో రీజనల్ రింగ్‌రోడ్డు వెంట ఇండస్ట్రియల్ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇప్పటికే జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, బీబీనగర్, భూదాన్‌పోచం పల్లి మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో టీఎస్ ఐపాస్ కింద మొత్తం 1,090 పరిశ్రమలు ఉండగా, వీటి ద్వారా 41,270 మంది ఉపాధి పొందుతున్నారు. టీఐడియా, టీప్రైడ్ పథకాల కింద 796యూనిట్లు మంజూరయ్యాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎంఎ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రాష్ట్ర ఆదాయాన్ని మెరుగు పరిచేందుకు ప్రభు త్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా అన్ని శాఖలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఆదాయం పెంపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఆయా ప్రాంతాల్లో నగరానికి చేరువలో ఉండటంతో రియల్ ఎస్టేట్‌తో పాటు ఎక్సైజ్, వాణిజ్య పన్నులశాఖ ద్వారా సర్కారుకు ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం ఉన్న ఆదాయాన్ని మరింతగా పెంచేందుకు హైదరాబాద్ సమీపం లో ఉన్న జిల్లాలో పారిశ్రామికాభివృద్ధితో పాటు టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లా కేంద్రాల్లో విలువైన భూములను కాపాడేందుకు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మైనింగ్‌శాఖ పరిధిలో ఖనిజ సంపదను వెలికితీయడం ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఈ శాఖల ద్వారా ప్రభుత్వం మరింత ఆదా య పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

# వృత్తి కాలేజీల బంద్

**ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన**

**సిఎం రేవంత్‌తో భట్టి, శ్రీదర్ బాబుల సమిక్ష**

హైదరాబాద్,సెప్టెంబరు15 : ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. కాలేజీల బంద్‌తో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఐటిశ్ఖాఖ మంత్రి శ్రీధర్ బాబులు సిఎం రేవంత్‌తో చర్చించారు. ఈ క్రమంలో తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించుకున్నట్లు స్పష్టంగా తేలినట్టు తెలుస్తోంది. విద్యార్థి సంఘాలు కూడా ఈ రిపోర్ట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాలేజీలు విద్యా ప్రమాణాలను విస్మరించి బకాయిల చెల్లింపుల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయంటూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నకిలీ సిబ్బందిని చూపించి అనుమతులు పొందడం, సౌకర్యాలు కల్పించకుండా కోట్లు దాచుకోవడం, తనిఖీలు తూతూమంత్రంగానే జరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా, కోట్ల రూపాయల నిధులు కాలేజీ యాజమాన్యాల మధ్య చేతులు మారుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలిం చేందుకు సిద్ధమవుతోంది. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవచ్చని సంకేతాలు ఇస్తోంది. ఈసారి ఎటువంటి నిర్ణయానికి దారితీస్తాయో విద్యార్థులు, కాలేజీలు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# గిరిజన ఆచారాల మేరకే మేడార్ అభివృద్ధి

**పూజారుల సూచనలతోనే పనులు**

**విమర్శకులు హద్దులు మీరొద్దన్న సీతక్క**



ములుగు,సెప్టెంబర్ 15: పగిడిద్దరాజు, గోవిందరాజు వంశస్తుల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారమే మేదారం సమ్మక్క సారలమ్మ ఆలయ నిర్మాణ పనులు ఉంటాయని మంత్రి సీతక్క తెలిపారు. వెయ్యేళ్ల చరిత్ర గల మేదారం దేవాలయ విశిష్టత మరో వెయ్యేళ్లపాటు వెలుగొందేలా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ మేరకు మేదారం కీర్తి, గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసేలా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారమే జరుగుతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మేదారంలో పర్యటించి సమ్మక్కసారలమ్మ జాతర నిర్వహణ, అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి విషయానికి కొస్తే డిజైన్ రూపకల్పనలో ఎవరి ప్రమేయం ఉండదు. పూజారులు, స్థానికుల అభిప్రాయం మేరకే డిజైన్లు రూపొందిస్తాం. పూజారుల ఆలోచనల మేరకే ఆయన అభివృద్ధికి అడుగులు వేస్తాం. సమ్మక్కసారలమ్మ తల్లులపై సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో నమ్మకం ఉంది. తల్లుల దీవెనలతో ఇక్కడి నుంచి పాదయాత్ర చేసి తాను అధికారంలోకి వచ్చినట్టు ముఖ్యమంత్రి ఎన్నోసార్లు చెప్పారు. భక్తులకు మరింత సులభంగా తల్లుల దర్శన భాగ్యం కల్పించేందుకు పూజారుల సూచన మేరకు గుడి విస్తీర్ణాన్ని పెంచుతున్నామని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టి మహాజాతర లోపు నిర్మాణాలు పూర్తి చేస్తాం. ఆదివాసీ జాతి బిడ్డగా నేను, సమ్మక్కసారలమ్మ తల్లుల భక్తుడిగా సీఎం రేవంత్ ప్రత్యేకంగా దృష్టి సారించి మేదారం గుడిని అభివృద్ధి చేస్తున్నాం. మేదారంలో భక్తులకు తల్లుల దర్శనంతోపాటు, వారి త్యాగాల చరిత్రను తెలియచెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే మేదారంలో రేవంత్ రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు. పూజారులు చెప్పినట్లే నడుచుకుంటున్నాం. ఎక్కడా బయట వ్యక్తుల ప్రమేయం ఉండదు. తప్పుడు ప్రచారం చేస్తే తల్లుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని విమర్శకులను హెచ్చరించారు.

## ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల**

హుజూరాబాద్,సెప్టెంబరు15 : తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందని అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో రూ.9 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వల్ల చాలా నష్టం జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ విద్యార్థులకు వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి.. పాత విధానంలోనూ రీయింబర్స్‌మెంట్ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత బాధ్యత లేని ప్రభుత్వాన్ని చూడలేదు. సమస్యలు పరిష్కరించకపోతే.. ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను ఒక సంవత్సరం ముందు నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తింది. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టకుండా ఎరువులు వచ్చే మార్గంపై దృష్టి పెట్టాలని ఈటల సూచించారు.

## రైతుల భూములు పోకుండా అడ్డుకుంటాం

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్,సెప్టెంబరు15 : కాంగ్రెస్ ప్రభుత్వం రీజినల్ రింగ్‌రోడ్డు కోసం అలైన్‌మెంట్‌ను ఇష్టారీతిన మారుస్తోందని, రైతులు తమ భూములు కోల్పోకుండా నిలదీస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ రైతులు హరీశ్‌రావును కలిశారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చి పేద రైతుల పొట్ట కొట్టడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యల వల్ల రైతులు భూములు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. సీఎం సొంత భూములకు మేలు కలిగేలా అలైన్‌మెంట్ మార్చడం దుర్మార్గం.

# పార్టీ మారిన పదిమందిపై వేటేయండి

**స్పీకర్‌ను కోరిన బిఆర్ఎస్ పార్టీ**

**అదనపుకార్యదర్శికి ఆధారాలుసమర్పించిన జగదీశ్ రెడ్డి**

హైదరాబాద్,సెప్టెంబరు15 : పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు బిఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. శాసనసభ ప్రాంగణానికి వెళ్లిన ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు శాసనసభ అదనపు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డిని కలిశారు. తమ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆధారాలు అందించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణను అధికారులు మాకు తెలియజేశారు. వారి వివరణపై భారత రాష్ట్రసమితి పార్టీ నిర్ణయం చెప్పాలని మాకు మూడు రోజులు గడువు ఇచ్చారని అన్నారు. మేం సుప్రీంకోర్టుకు వెళ్ళడంతో ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. స్పీకర్ పదిమంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. దాంతో కొంతమంది ఎమ్మెల్యేలు మేం అమాయకులం, కేసీఆర్‌పైన నమ్మకం ఉంది అని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. దాంతో స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాన్ని మాకు పంపిస్తూ మూడు రోజుల్లో మమ్మల్ని సమాధానం ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఎక్కువ రోజులు సమయం ఇచ్చిన స్పీకర్ మాకు మాత్రం మూడు రోజులే సమయం ఇచ్చారు. స్పీకర్ గడువు ఇచ్చిన మూడు రోజుల్లోనే మేం సమాధానం ఇచ్చాం అని అన్నారు. మేం పార్టీ మారలేదని, సీఎం దగ్గరకు వెళ్తే మా మెడలో మూడు రంగుల కండువా కప్పారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అమాయకంగా చెప్పారు. వారు అమాయాకత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ సభలు, సమావేశాల్లో పదిమంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోచారం మాటలను ఏఐ ద్వారా ఏమైనా మార్ఫింగ్ చేశారా.. నా నియోజకవర్గంలో సమస్యలు ఉన్నాయంటే సీఎం మా ఇంటికి వచ్చారని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్‌పై నమ్మకం ఉంటే కేసీఆర్ ఫోటో, కేసీఆర్ కండువా ఉండాలి కదా.. అభివృద్ధి కోసం సీఎంను కలిసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి రాహుల్ గాంధీ, మహేష్ కుమార్ గౌడ్‌ను ఎందుకు కలిశారని ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ నేను నియోజకవర్గ అభివృద్ధి కోసం వెళ్తే సడెన్‌గా సీఎం కండువా కప్పారని చెప్పారు. మరి సంజయ్ పేపర్ ప్రకటనల్లో కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉన్నారు.. గాంధీ భవన్, కాంగ్రెస్ పార్టీ మీటింగ్స్ లో పాల్గొంటే అభివృద్ధి ఎట్లా అవుతుంది.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. మేము తప్పుచేసి పార్టీ మారామని నియోజకవర్గ ప్రజల ముందు ఒప్పుకోవాలి. మేం పార్టీ మారలేదని కేసీఆర్ దగ్గర పిటిషన్ పెట్టుకోండి. నోటీసులు వచ్చాక కేసీఆర్ దగ్గరకు రావాల్సిన పదిమంది ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి దగ్గరకు ఎందుకు వెళ్లారు.. ఎన్ని చేసినా పదిమంది ఎమ్మెల్యేలు తప్పించుకోలేరు. వాళ్లు దొరికిపోయిన దొంగలు. సీఎం రేవంత్ రెడ్డి మూటలతో దొరికి తప్పించుకున్నారు. మేం తప్పించుకోలేమా అని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పదిమంది ఎమ్మెల్యేలు ఇక్కడ తప్పించుకున్నా కోర్టు ముందు తప్పించుకోలేరు అని అన్నారు. ఉప ఎన్నికలు రావడం ఖాయం. మీకు రాజకీయ భవిష్యత్ లేకుండా ప్రజలు చేయడం ఖాయం. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ విదేశాల్లో ఉండటంతో వచ్చిన తర్వాత స్పీకర్‌కు ఆధారాలు సమర్పిస్తారు. కోర్టు ఇచ్చిన గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి. కోర్టు గడువు ఉన్నందున ఎక్కువ రోజులు సమయం లేదని, మూడు రోజుల్లో చెప్పాలని స్పీకర్ మమ్మల్ని కోరారు.

# నాలాల కబ్జా వల్లనే అకస్మాత్తు వరదలు

**కొట్టుకుపోయిన ఇద్దరికి 5లక్షల చొప్పునపరిహారం**

**నగరంలో అనేక చోట్ల ఇలాంటి కబ్జాల వల్లనే ప్రమాదాలు**

**మాగంబస్తీలో రంగనాథ్, కలెక్టర్ హరిచందన పర్యటన**




హైదరాబాద్,సెప్టెంబరు15 : భారీ వర్షం నేపథ్యంలో ఆదివారం రాత్రి అఫ్జల్‌సాగర్‌లో ఇద్దరు గల్లంతయ్యారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నాలాల కబ్జా వల్లే వరద సమయంలో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నిర్మాణం కారణంగా నాలాల్లో వరద నీరు అడ్డుపడింది. అఫ్జల్ సాగర్ వద్ద కొన్ని ఇళ్ల తొలగింపునకు నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే ముగ్గురు గల్లంతయ్యారు.. ఇద్దరు మృతిచెందారు. అన్ని సమస్యల పరిష్కారానికీ హైడ్రా కృషిచేస్తుందని తెలిపారు. అఫ్జల్‌సాగర్ డ్రైనేజీలో ఇద్దరు గల్లంతైన ఘటనలో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రకటించారు. గల్లంతైనవారి ఆచూకీ ఇంకా లభించలేదన్నారు. పాత ఇళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. కొన్ని నాలాలపై నిర్మాణాలు ఉన్నాయి.. వాటితో అందరికీ ప్రమాదమేనని హెచ్చరించారు. అఫ్జల్‌సాగర్ పరిధిలో ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఆమె తెలిపారు. హైదరాబాద్ ఆదివారం రాత్రి భారీ వర్షాలతో వణికిపోయింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వాన కారణంగా నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఫ్లాష్‌ఫ్లడ్స్ కారణంగా రోడ్లు, కాలనీలు వరద నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌లోని మాంగర్‌బస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. వరద నీటికి ఇద్దరు కొట్టుకుపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రంగంలోకి దిగారు. మాంగర్‌బస్తీ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు జరిగిన ఇబ్బందులను తెలుసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాంగర్‌బస్తీ మాత్రమే కాదు, హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో నాలాలు కబ్జాకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాంటి కబ్జాలు ఉండటం వల్లే ఫ్లాష్‌ఫ్లడ్స్ రూపంలో విపత్తులు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. మాంగర్‌బస్తీ ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా వ్యవస్థ ప్రాధాన్యత ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమవుతోందని రంగనాథ్ వివరించారు. అంతేకాదు, ఈ మోడల్‌ను చూసి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోకూడా హైడ్రా తరహా వ్యవస్థ అవసరమన్న డిమాండ్ వస్తోందని తెలిపారు. మాంగర్‌బస్తీ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో 145 ఇళ్లు నాలాపైనే నిర్మించబడ్డాయని తెలిపారు. స్థానికులు ముందుకొస్తే, వారికి ప్రభుత్వ పథకంలో అందించే ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా దీనిపై స్పందిస్తూ, మాంగర్‌బస్తీ సమస్యకు వారంరోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. నాలాకు అడ్డుగా ఉన్న నాలుగైదు ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. అయితే, అన్ని ఇళ్లను తొలగిస్తారని భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల ఇళ్లను కూల్చేయాలన్న ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

మాంగర్‌బస్తీ ఘటనతో ప్రభుత్వ యంత్రాంగం కదిలిపోయింది. నాలాల కబ్జాలు, అనధికార నిర్మాణాలు, వర్షాకాలంలో పునరావృతమయ్యే వరద సమస్యలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులు తేల్చుకున్నారు. వచ్చే వారాల్లో స్పష్టమైన చర్యలు అమలులోకి వస్తాయని, ప్రజలు నమ్మకంగా ఉండాలని సూచించారు.

# అభివృద్ధి,సంక్షేమం వైపుగా కృషి

### ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పని


### కలెక్టర్లు స్మార్ట్ వర్క్ అలవాటు చేసుకోవాలి

### స్వర్ణాంధ్రప్రదేశ్2047 లక్ష్యం కోసం పనిచేయాలి

### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,సెప్టెంబర్15: ఓవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలు తమపై చూపిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. కొత్తగా వచ్చిన కలెక్టర్లకు ప్రజల తరఫున చంద్రబాబు అభినందనలు తెలిపారు. పాత కలెక్టర్లు కూడా తమ పనితీరును నిరూపించుకోవాలన్నారు. జిల్లా రూపు రేఖలు మార్చే అవకాశం కలెక్టర్లకు ఉంది. పాలసీ ఇవ్వడమే కాదు.. అమలు చేయడం ముఖ్యం. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంతకుముందు హార్డ్‌వర్క్ ఉండేది. ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలని సూచించారు. ఎకో సిస్టమ్ తయారు చేయాలి. భారత్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి. మోదీ ప్రధాని అయ్యాక 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైంది. స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు పూర్తయ్యే సమయానికి మన దేశం అగ్రస్థానానికి చేరుకుంటుంది. నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకెళ్తే ఏదైనా సాధించగలుగుతాం అన్నారు. 1991కి ముందు సంస్కరణలు రాలేదు. అప్పుడు ఆర్థిక వృద్ధి రెండు లేదా మూడు శాతం ఉండేది. దేశ వృద్ధి రేటును చూసి అప్పుడు కొందరు ఎగతాళి చేసేవారు. టెక్నాలజీపై మాట్లాడితే అవహేళన చేశారు. సంస్కరణలపై మాట్లాడితే చాలా మంది వద్దన్నారు. ఆనాడు సంస్కరణలు వద్దన్న రాజకీయ పార్టీల మనుగడే ఇప్పుడు లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన విధానంతో వికసిత్ భారత్2047 తయారు చేసింది. మనం కూడా స్వర్ణాంధ్రప్రదేశ్2047 రూపొందించాం.. ఇది అధికారులకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. ప్రపంచంలో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉండాలనేదే నా ఆలోచన. సామాజిక న్యాయాన్ని పరిగణిస్తూ సమర్థతకు పెద్దపీట వేస్తున్నాం. డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్ లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం వృద్ధిరేటు 10.5 శాతంగా ఉంది. 15 శాతం వృద్ధిరేటు సాధించగలగాలి. 2029 నాటికి రూ.29 లక్షల జీఎస్డీపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అప్పటికి రూ.4.67లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 తీసుకొచ్చాం. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. ప్రభుత్వ విధానాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లదని చంద్రబాబు అన్నారు.





# వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలు

### సాంకేతికతను ప్రజలకు చేరువచేశాం

### ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తేనే ఫలితాలు

### సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం

### కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి,సెప్టెంబర్15:వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌరసేవలు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ ద్వరా ప్రజలకు పౌరసేవలు చేరువ చేశామని అమన్నారు. సోమవారం సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అధికారులకు సీఎం చంద్రబాబు పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పాలనలో మొదటి ఏడాది పరీక్షలు పూర్తి అయి-ంపోయాయని చెప్పుకొచ్చారు. ఇంకా బాధ్యతగా పనిచేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు సీఎం చంద్రబాబు. ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయకపోతే ఫలితాలు రావని పేర్కొన్నారు. సాంకేతికత పెరిగిన దృష్ట్యా స్మార్ట్ వర్క్ చేయాల్సిందేనని ఆదేశించారు. ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఆర్టీజీఎస్ సేవలను ఉపయోగించుకోవాలని మార్గనిర్దేశర చేశారు. విజన్ రూపొందించి దానికి నిధులు కేటాయించక పోతే ఇబ్బందులు వస్తాయని చెప్పుకొచ్చారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని చెప్పామని.. అదే విధంగా సూపర్ సిక్స్‌ను సక్సెస్ చేశామని ఉద్ఘాటించారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకంలో భాగంగా 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏడుగురు పిల్లలు ఉన్న తల్లికి కూడా ఈ పథకాన్ని వర్తింప చేశాం. ఆ కుటుంబాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. ?విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఉచిత బస్సు అమలు చేయలేమని కొందరు విమర్శించారు... కానీ స్త్రీశక్తి పథకం సఫలమైందని బాబు అన్నారు. 50 శాతం మహిళలను వంటింటికే పరిమితం చేస్తే వారి శక్తియుక్తులు వృథా అవుతున్నాయి.

పనిచేయగల వారిని సమర్థంగా వినియోగించుకుంటే జీఎస్డీపీ పెరుగుతుంది. ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పు తెస్తుందన్నారు. ఈ పథకం అమలు తర్వాత 90 శాతం మేర ఆర్టీసీలో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. దీపం 2 పథకం ద్వారా.. ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ.7 వేలు ఇచ్చాం. మూడు విడతల్లో రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా రూ.15 వేలను అక్టోబరు 1 తేదీన ఇస్తాం. పీపీపీ విధానంలో పోర్టులు, ఇన్‌ఫ్రా పెరిగింది. ఆర్థిక అసమానతలు పెరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. సమాజంలోని అన్ని ప్రాంతాల్లోనూ అవకాశాలు రావాలి... ప్రతిఫలాలు అందాలి. గతంలో రాయలసీమ అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొనే ప్రాంతం.. ఇప్పుడు కోనసీమతో సమానంగా ఉంది. ప్రపంచంలోని నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయుడైతే.. అందులో ఏపీవాళ్లే ఎక్కువ ఉన్నారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ లాంటి విధానాలతో సమర్థనీటి నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పట్టిసీమతో డెల్టాలో వాడే కృష్ణానీటిని పొదుపు చేసి శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగాం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువను వంద రోజుల్లో పూర్తి చేసి కుప్పం వరకూ కృష్ణా నీళ్లు తీసుకెళ్లాం. గోదావరిలో వేలాది టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం. వాణిజ్య పంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలి. కలెక్టర్లు బ్యూరోక్రాటిక్‌గా కాకుండా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుని పాలసీలు అమలు చేయాలన్నారు. ఐదేళ్లలో 25 కలెక్టర్ల కాన్ఫరెన్సులు, 125 కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహిస్తాం. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, సిఎస్ విజయానంద్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధికి మహిళా సాధికారతే ముఖ్యం

### వారితో కుటుంబమే కాదు..సమాజపురోగతీ సాధ్యం

### మహిళా సాధికారిత సదస్సులో గవర్నర్ నజీర్

తిరుపతి,సెప్టెంబర్15: మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. వారికి గౌరవం లేని చోట ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు పురాణాల్లో కనిపించవని చెప్పారు. మన వేదాలు, ఉపనిషత్తులు మహిళలను గౌరవించాలని చెబుతున్నాయన్నారు. కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుంది. ఇదే రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. మొల్ల రామాయణం రాసిన కవయిత్రి మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. కేవలం ఆస్తుల్లో భాగస్వామ్యం లేకపోవడం వల్ల మహిళలు చాలా సార్లు తండ్రి, సోదరుడు, భర్తపై ఆధారపడతారు. పురుషాధిక్యత సమాజంలో వారికి రెండో స్థానం ఇచ్చారు. కానీ సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లుఅని అన్నారు. భారత రాజ్యాంగం అందరినీ సమానంగా గుర్తిస్తుంది. లింగ సమానత్వానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత ఉంది. మహిళలు ఎన్నో సవాళ్లను దాటి రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో వారి హక్కులను కాపాడేలా తీర్పులు ఇచ్చింది. ఆయా తీర్పులు హక్కులను కాపాడటంలోనే కాదు, సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించాయి. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రువాండాలో 30 శాతం పార్లమెంటరీ సీట్లు కేటాయిస్తూ చట్టం చేసిన కొద్ది కాలానికే అక్కడ వృద్ధి పెరిగింది. భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ. విద్య ద్వారానే వారికి సాధికారత సాధ్యం అవుతుందని గవర్నర్ అన్నారు.



# తిరుమల బ్రహ్మోత్సవాల్లో కట్టుదిట్టమైన భద్రత

### పోలీస్, విజిలెన్స్ అధికారులతో అదనపు ఇవో సమీక్ష

తిరుమల,సెప్టెంబరు15 : ఈనెల 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సోమవారం తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతో కలిసి విజిలెన్స్, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తున్నాయని, దీని ద్వారా రోజుకు సుమారు 1.60 లక్షల మంది భక్తులకు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించవచ్చని చెప్పారు. తిరుపతిలోని 23 పార్కింగ్ ప్రదేశాలను వాహనాల పార్కింగ్ కోసం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల నుండి 2 లక్షల వరకు భక్తులు కూర్చునే సదుపాయం ఉందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. 4200 మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైమ్ మానిటరింగ్ చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి, రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. వీలైనంత వరకు సురక్షితమైన పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ సేవలను వినియోగించు కోవాలని ఈ సందర్భంగా అదనపు ఈవో భక్తులకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ శ్రీ రామకృష్ణ పాల్గొన్నారు.

# పేదవాడికి వైద్యం కోసం 17 మెడికల్ కాలేజీలు ప్రారంభం

### పాడేరు ఏజెన్సీలో సైతం అందుబాటులోకి 50 సీట్లు

### చంద్రబాబు ఒక్క కాలేజీ అయినా తెచ్చరా

### మాజీమంత్రి విడుదల రజని విమర్శలు



గుంటూరు,సెప్టెంబర్ 15: వైఎస్సార్ సిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి పేదవాడికి విద్య, వైద్య భద్రత కోసం 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టాం అని మాజీ మంత్రి విడదల రజని అన్నారు. పాడేరు లాంటి ఏజెన్సీ ప్రాంతంలో కూడా అనుమతులు తెచ్చి 50 సీట్లు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి విడదల రజిని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఒకేరోజు ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభించిన ఘనత మా నాయకుడు జగన్ కే దక్కుతుంది. రూ. 8500 కోట్లతో 17 మెడికల్ కళాశాలలు తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.. యుద్ధ ప్రాతిపదికన కళాశాలల నిర్మాణం పూర్తి చేసి పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలని చూశాం. మూడు ఫేజ్ లలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టాలని రూట్ మ్యాప్ తో ముందుకు వెళ్ళాం. రూ. 500 కోట్లతో ఒక్కొక్క కళాశాల నిర్మాణం చేయాలని చూశాం. అప్పుడు టిడిపి నేతలు దీనిమీద బురదచల్లే ఆరోపణలు చేశారని ఆమె మండిపడ్డారు. కళాశాలలు అన్ని రకాల ఫైనాన్సియల్ అసిస్టెన్స్ తోనే పనులు ప్రారంభించి ముందుకు వెళ్ళాం. ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తిచేసే దిశగా అడుగులు వేశాం. కానీ నేడు కూటమి ప్రభుత్వ నాయకులు వాటికి అనుమతులు లేవని అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పులివెందుల కళాశాలలో మాకు సీట్లు వద్దు అని కూటమి ప్రభుత్వం ఎన్ఎంసీకి లేఖ రాసింది. వైఎస్ కుటుంబం మీద ఉన్న కక్షను ఆ ప్రాంత ప్రజలపై చూపించారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు పనులు జరుగుతూనే ఉన్నాయి. ఫస్ట్ ఫేజ్లో పూర్తయిన ఐదు కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దృష్టి సారించి పనులు చేసి ఉంటే మరో ఐదు కళాశాలల్లో 750 సీట్లు అందుబాటులోకి వచ్చి ఉండేవి. థర్డ్ ఫేజ్ లో ఉన్న కళాశాలలకు సంబంధించిన మేజర్ వర్క్స్ మా హయాంలోనే పూర్తయ్యాయని వెల్లడించారు. నిర్మాణాలు జరిగిన ప్రాంతంలో కాకుండా మరోవైపుకు వెళ్లిన మంత్రులు స్విమ్మింగ్ పూల్ అంటూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలల పనులను ఆపి వేశారు. అధికారులు ప్రభుత్వ ఆదేశాలతో పనులు నిలిపి వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. గొప్ప ఆశయంతో జగన్ ప్రారంభించిన పనులను నీరుగార్చారు. పీపీపీ అని చెప్పి ముసుగేసి వాళ్లకు సంబంధించిన వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. మెడికల్ కళాశాలలు పూర్తయితే జగన్ కు మంచి పేరు వస్తుందని కుట్రలు చేస్తున్నారు. ప్రజల్లో విపరీతమైన ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పు. వైసిపి ప్రజల పక్షాన పోరాడుతుందని ఆమె అన్నారు. శాఖకు సంబంధం లేని మంత్రులు దీనిపై అపహాస్యం చేసి మాట్లాడుతున్నారు. లేనిది ఉన్నట్లు చూపించటం అంటే గ్రాఫిక్స్... కానీ, మంత్రి ఉన్నది లేనట్లు చూపించడం ఎంతవరకు సమంజసం అని ఆమె దుయ్యబట్టారు. స్థానిక ప్రజలను అడిగితే పనులు ఎంతవరకు జరిగాయో చెప్తారు. 14 ఏళ్లు ముఖమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీ తెచ్చే ఆలోచన అయినా చేశారా.. అని ఆమె ప్రశ్నించారు. చిత్తశుద్ధి లేకుండా కాలేజీలు ప్రైవేటీకరణ చేసే కుట్రలు చేస్తున్నారు.. మీ నిర్ణయం తప్పు అని ఎంతవరకైనా పోరాడేందుకు మేం సిద్ధం అని ఆమె ప్రకటించారు. ప్రజల ఆరోగ్యాలను, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేయాలని చూస్తున్నారు. మంత్రి సత్య కుమార్.. వైఎస్ జగన్ కు రాసిన లేఖలో వాస్తవానికి దూరంగా అనేక అంశాలు ఉన్నాయి.. మీ వల్లే మేం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని లేఖలో ప్రస్తావించారు. ప్రైవేటీకరణ కరెక్ట్ అని వాళ్లకు వాళ్లే ఫిక్స్ అయ్యి నిర్ణయం తీసుకున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేసిన మంచి ప్రజల గుండెల్లో ఉంటుంది. మెడికల్ కళాశాలల పీపీపీ మోడ్ ఎక్కడా సక్సెస్ కాలేదు. పలు రాష్ట్రాల్లో ఈ విధానం ట్రై చేసి సాధ్యం కాదని వదిలేశారు.

# డిఎస్సీ విజేతలకు మంత్రి రామ్మోహన్ అభినందనలు




శ్రీకాకుళం,సెప్టెంబర్ 15: ఏపీ డీఎస్సీ తుది జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులందరికీ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులుగా కొత్త ప్రయాణాన్ని ఆరంభించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే శక్తి ఇప్పుడు మీ చేతుల్లోనే ఉందంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఒక బలమైన నాయకత్వం ఏం చేయగలదో, ఏం సాధించగలదో చూపేందుకు ఈ మెగా డీఎస్సీ ఒక నిదర్శనం. ఐదేళ్ల అనిశ్చితి తర్వాత కేవలం 150 రోజుల్లో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేయడం.. చంద్రబాబు నాయుడు గారి దార్శనిక నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చూపిన నిబద్ధతకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇది కేవలం ఎంపిక మాత్రమే కాదు, ఇది ఆంధ్రప్రదేశ్ విద్యా భవిష్యత్తుకు ఒక కొత్త అధ్యాయం అని అన్నారు. ఏపీలో యువతకు అండగా నిలిచిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుందనే ఆయన హామీ.. వేలాది మంది అభ్యర్థులకు కొత్త ఆశలు నింపిందన్నారు. ఈసారి అవకాశం రాని అభ్యర్థులు నిరుత్సాహ పడకుండా మరింత కృషితో, ప్రేరణతో ముందుకు సాగాలి. మీ సమయం వస్తుంది. అవకాశాలు మళ్లీ తలుపు తడతాయని పేర్కొన్నారు.

# మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం

### బాలికా విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిందే

### జాతీయ మహిళా సాధికారత సదస్సులో స్పీకర్ ఓంబిర్లా



తిరుపతి,సెప్టెంబర్15: మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ సాధించలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడారు. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకువచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు. ప్రతి మహిళకు భద్రత, ఆత్మ నిర్భరత అందించాలి. పంచాయతీ స్థాయిలో కంప్యూటర్ సెంటర్ ఉండేలా చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఎకనామిక్ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్య్రం సాధిస్తే.. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ కమిటీలు ప్రణాళికలు రూపొందించాలి. దేశంలోని ఆఖరి మహిళకు కూడా ఫలితాలు అందేలా ప్రణాళికలు ఉండాలి. పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి పార్లమెంట్ వరకు ప్రతి ఒక్కరూ మహిళల వృద్ధి కోసం కృషి చేయాలి. గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. అన్ని రాష్ట్రాల్లో విమెన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించకపోతే మనం వికసిత్ భారత్ కల సాకారం చేసుకోలేం' అని ఓం బిర్లా అన్నారు.

# లిక్కర్ కేసులో ఎసిబి కోర్టులో సిట్ ఛార్జిషీట్

విజయవాడ,సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ లో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ మరో కీలక అడుగు వేసింది. ఈ కేసులో మూడో అదనపు ఛార్జ్ షీట్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటి వరకు మొత్తం 48 మందిని నిందితులుగా చేర్చగా.. 12 మందిని అరెస్టు చేసింది. ఇదే కేసులో నలుగురికి ఇటీవల ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ స్కామ్ లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ పాత్రను తాజా ఛార్జ్ షీట్‌లో సిట్ స్పష్టంగా పేర్కొంది. ఈ స్కామ్ లో కొల్లగొట్టిన డబ్బును ఈ నలుగురి ద్వారా ఎలా మళ్లించారో ఛార్జ్ షీట్‌లో సిట్ వివరించింది.ప్రస్తుతం గుంటూరు జైల్లో బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ రిమాండ్ ఖైదీలుగా ఉండగా.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. లిక్కర్ స్కామ్ లో వరుసగా ఒక్కొక్కరి పాత్రపై ఛార్జ్ షీట్‌లో సిట్ వివరించినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్ లో నిధుల మళ్లింపుపై సిట్ ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తోంది.



## డీప్ ఫేక్ కోసం చాట్‌జీపీటీ సాయం

### ఉత్తరకొరియా హ్యాకర్ల కొత్త పంథా

**ఉత్తరకొరియా :** దక్షిణ కొరియాను లక్ష్యంగా చేసుకోవడానికి ఉత్తర కొరియాకు చెందిన హ్యాకింగ్ గ్రూప్ చాట్‌జీపీటీ సాయం తీసుకోవడం కలకలం సృష్టిస్తోంది. దాంతో ఓ మిలిటరీ ఐడీ డాక్యుమెంట్ సృష్టించినట్లు సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. హ్యాకర్లు దక్షిణ కొరియా మిలిటరీ గుర్తింపు కార్డు నకిలీ ముసాయిదా తయారీ కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్ వాడినట్లు తెలిసింది. ముసాయిదా నిజమైనది అని నమ్మించడానికి ఈ ప్రయత్నం చేసినట్లు సమాచారం. అవతలి వ్యక్తులు ఈ మెయిల్ పొందగానే వారి డేటాను దొంగిలించేలా దీనిని రూపొందించినట్లు జీనియన్స్ వెబ్‌సైట్ పేర్కొంది. ఈ దాడికి బాధ్యత వహించిన బృందాన్ని కిమ్‌సుకీ అని పిలుస్తున్నారు. కిమ్ ప్రభుత్వ ప్రాయోజిత ఈ సైబర్ ముఠా గతంలోనూ అనేకసార్లు దక్షిణ కొరియాను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడింది. దీనిపై యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ కూడా గతంలోనే హెచ్చరించింది. ఉత్తర కొరియా ప్రభుత్వం నుంచే ఈ ముఠాకు ఆదేశాలు అందుతాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా నిఘా సమాచారాన్ని రాబట్టడమే వీరి పని అని చెప్పింది. తాజాగా హ్యాకర్లు ఏఐ వినియోగించడంపై జీనియన్స్ జులైలో పలు విషయాలు కనుగొంది. సొంతంగా కొన్ని ప్రయోగాలు కూడా చేసింది. చాట్ జీపీటీని ఫేక్ ఐడీలను తయారుచేయమని కోరగా అది తొలుత నిరాకరించిందట. తర్వాత ప్రాంప్టింగ్ మార్చగా ముందుకెళ్లిందట. ఉత్తర కొరియా హ్యాకర్లు క్లాడ్ కోడ్ టూల్స్ వినియోగిస్తున్నారని 'ఆంత్రోపిక్' సైతం ఆగస్టులో హెచ్చరించింది. దాని సాయంతో యూఎస్ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో నియమితులై రిమోట్‌గా హ్యాకర్లు పనిచేస్తున్నారని ఆరోపించింది. వారికి నకిలీ గుర్తింపులు, పాస్ కోడింగ్ అసెస్‌మెంట్లు రూపొందించడానికి క్లాడ్ తోడ్పడినట్లు తెలిపింది. తాజా ఫిషింగ్ లక్ష్యాలలో జర్నలిస్టులు, పరిశోధకులు, ఉత్తర కొరియాపై దృష్టిసారించే మానవహక్కుల కార్యకర్తలు ఉన్నారు. సౌత్ కొరియా నుంచి మిలిటరీ మెయిల్ వచ్చిన తరహాలో నకిలీ మెయిల్స్ పంపించి వారిని బురిడీ కొట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఎంతమంది సైబర్ బాధితులు ఉన్నారనే విషయం మాత్రం వెల్లడి కాలేదు. ఉత్తర కొరియా హ్యాకర్లు తమ ఏఐ టూల్‌ను వినియోగిస్తున్నారనే సమాచారంపై స్పందించడానికి ఓపెన్ ఏఐ ప్రతినిధులు అందుబాటులోకి రాలేదు. నకిలీ రెజ్యూమెలు, కవర్ లెటర్లు, సోషల్ మీడియా పోస్టులు తయారుచేస్తున్న కొన్ని అనుమానిత ఉత్తర కొరియా అకౌంట్లను నిషేధించినట్లు ఆ కంపెనీ ఫిబ్రవరిలో ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

## ఆఫీసులో వేధింపులతో ఉద్యోగిని ఆత్మహత్య

- యాజమాన్యానికి రూ.90కోట్ల జరిమానా
- టోక్యో జిల్లా కోర్టు సంచలన తీర్పు



**టోక్యో :** పని ప్రదేశంలో వేధింపులు ఎదుర్కొన్న ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్నారు. దానిపై విచారణ జరిపిన న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. రూ.90కోట్ల పరిహారం చెల్లించాలని యాజమాన్యాన్ని ఆదేశించింది. ఆంగ్ల మీడియా కథనాల ప్రకారం.. జపాన్ రాజధాని టోక్యోకు చెందిన కాస్మోటిక్స్ బ్రాండ్ డి-యూపీ కార్పొరేషన్ సంస్థలో 25 ఏళ్ల సటోమి విధులు నిర్వర్తించారు. 2021 ఏప్రిల్‌లో ఆమె ఉద్యోగం చేరారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఒక మీటింగ్‌లో భాగంగా కంపెనీ ప్రెసిడెంట్ మిత్సురు సకై ఆమెను పరుష పదజాలంతో విమర్శించారు. ముందస్తు అనుమతి లేకుండా క్లయింట్లను కలిసినందుకు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను వీధికుక్క అని అవమానించారని, సంస్థ నిబంధనలను పాటించలేదని మండిపడ్డారని ఆ కథనాలు పేర్కొన్నాయి. అంతటితో ఆగకుండా.. మరుసటి రోజుకూడా అలాంటి మాటలతోనే అవమానపర్చారు. దాంతో ఆమె మానసికంగా కుంగిపోయారు. తర్వాత డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిన ఆమె.. చికిత్స నిమిత్తం కొన్ని రోజులు సెలవు తీసుకున్నారు. కానీ రోజురోజుకూ ఆమె పరిస్థితి క్షీణించింది. 2022 ఆగస్టులో ఆమె ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. దాని కారణంగా కోమాలోకి వెళ్లిపోయి.. 2023 అక్టోబర్లో ప్రాణాలు కోల్పోయారు. తమ కుమార్తె ఎదుర్కొన్న పరిస్థితిపై తల్లిదండ్రులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. ఆ కాస్మోటిక్స్ కంపెనీతోపాటు ప్రెసిడెంట్‌పైనా కేసు పెట్టారు. మిత్సురు సకై వ్యాఖ్యలు.. ఆమె మానసిక పరిస్థితి దిగజారడానికి సంబంధం ఉందని దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనను పనిప్రదేశంలో జరిగిన ఒక ప్రమాదంగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీనిపై తాజాగా టోక్యో జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆమె మృతికి డి-యూపీ కార్పొరేషన్, ప్రెసిడెంట్‌ను బాధ్యులని పేర్కొంది. యాజమాన్యం బాధిత కుటుంబానికి 150 మిలియన్ యెన్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.90కోట్ల) పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అలాగే మిత్సురు సకై వెంటనే తన పదవిని నుంచి దిగిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. తీర్పు అనంతరం సకై పదవికి రాజీనామా చేయగా.. కంపెనీ బహిరంగ క్షమాపణలు తెలిపింది. తమ విధానాలను సమీక్షించి, మెరుగుపర్చుకుంటామని వెల్లడించింది.

## అందుకే ఆ పెద్దాయన అప్లికేషన్ తీసుకోలేదు : కేంద్ర మంత్రి సురేశ్ గోపి



**కేరళ :** ఇటీవల కేరళలో జరిగిన ఓ ర్యాలీలో ప్రముఖ నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపిని సాయం కోరుతూ ఓ వృద్ధుడు అప్లికేషన్ ఇవ్వబోయాడు. కాగా తనకు ఇల్లు కావాలంటూ అతడు ఇచ్చిన అప్లికేషన్ పత్రాన్ని మంత్రి తిరస్కరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సురేశ్ గోపిపై నెటిజన్లు విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ విషయంపై కేంద్ర మంత్రి స్పందించారు. ప్రజాప్రతినిధిగా తాను ఎటువంటి పనులు చేయగలను, ఎటువంటివి చేయలేను అనే విషయాలపై తాను ఎల్లప్పుడూ స్పష్టతతో ఉంటానని అన్నారు. తాను నిలబెట్టుకోలేని అబద్ధపు హామీలు ప్రజలకు ఇవ్వలేనని అన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన విషయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అంశాలు కాబట్టి.. ఆ వృద్ధుడి నుంచి అప్లికేషన్ తీసుకోలేదని తెలిపారు. కొన్ని పార్టీలు ఈ వీడియోను రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. అయితే ఆ వృద్ధుడి కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తామని మరో పార్టీ ముందుకురావడం సంతోషకరమైన విషయమన్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ దాడులు
# భారత్‌కు లాభమా..?



**న్యూఢిల్లీ :** రష్యాపై ఉక్రెయిన్ దాడులు చేసేందుకు అవసరమైన సొమ్ము కోసం భారత్‌కు చమురు విక్రయిస్తోందని పశ్చిమ దేశాలు ఆరోపిస్తున్నాయి. కానీ, దీనికి భిన్నమైన మరో కోణం కూడా ఉంది. కీవ్ దళాలు ఇటీవల కాలంలో మాస్కోకు చెందిన చమురు క్షేత్రాలపై దాడులు చేస్తుండటం కూడా ఓ కారణంగా నిలిచింది. ఈ దాడుల ఫలితంగానే బ్రెంట్ చమురుతో పోలిస్తే ఉరల్స్ క్రూడ్‌ను బ్యారెల్‌కు 5-6 డాలర్లు తగ్గించి మరీ విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయిల్ పరిశ్రమలో ధరల మధ్య చిన్న తేడా కూడా భారీ మిగులును ఇస్తుంది.. అలాంటిది దాదాపు ఆరు డాలర్లు అంటే సామాన్యం కాదు.

### రష్యా రిఫైనింగ్ సామర్థ్యం దెబ్బ..

ఉక్రెయిన్ దళాలు పశ్చిమ దేశాల మద్దతుతో రష్యా చమురు శుద్ధి సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఆగస్టు చివరి నాటికి దాదాపు 17శాతానికి పైగా దాని రిఫైనింగ్ సామర్థ్యం దెబ్బతిందని లెక్కలు చెబుతున్నాయి. అతి స్వల్పకాలంలోనే కీవ్ డ్రోన్లు 10 రిఫైనరీలను ధ్వంసం చేశాయి. ఇవి రోజుకు 11లక్షల బ్యారెళ్ల చమురును శుద్ధి చేయగలవంటే అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా ప్రాసెస్ చేసి ఆయిల్‌ను ఎగుమతి చేయడం రష్యాకు కష్టంగా మారింది. అంత దేనికి.. మాస్కో, క్రిమియా సహా కొన్ని ప్రాంతాల్లో అవసరాలు తీర్చుకోవడానికే శుద్ధి చేసిన చమురు సరిపోవడంలేదు. దెబ్బతిన్నవాటిల్లో సైజరాన్, క్రస్నదోర్ రిఫైనరీలు, ద్రూఝూబా పైప్‌లైన్, ఉస్ట్-లుగా టెర్మినల్ వంటివి ఉన్నాయి. ఉత్పత్తి చేసిన చమురును రష్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఎగుమతి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా మరో 2 లక్షల బ్యారెళ్లను అంతర్జాతీయ మార్కెట్‌కు మళ్లించింది.

### భారత్‌కు ప్రయోజనకరంగా..

ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు కొనుగోలుదారు అయిన భారత్‌కు ఇది కలిసొచ్చింది. దీంతో రిలయన్స్, నయరా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం పెద్ద ఎత్తున రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకొంటున్నాయి. ఫలితంగా రిలయన్స్ రిఫైనింగ్ లాభాలు మరింత పెరగనున్నాయి. ఈ సంస్థ చమురును దేశీయంగా విక్రయించడంతోపాటు.. ఐరోపా, సింగపుర్, ఆఫ్రికాలకు ఎగుమతి చేస్తోంది. ఈ సంస్థ రిటైల్ విభాగం జియో-బీపీ కూడా రష్యా చమురుతో చెప్పుకోదగిన స్థాయిలో లబ్ధిపొందుతోంది. వీటి పెట్రోల్, డీజిల్ ధరలు గతేడాదితో పోలిస్తే 34శాతం, 39 శాతం చొప్పున పెరిగాయి. ఈ సంస్థ మొత్తం 2,000 ఇంధన స్టేషన్లను నిర్వహిస్తోంది. మొత్తంగా చమురు డిస్కౌంట్ల నుంచి భారత్‌కు 2.5 బిలియన్ డాలర్ల వరకు లబ్ధి ఉండొచ్చని సీఎల్ఎస్ఏ నివేదికలో వెల్లడించింది. మనదేశంలో రిఫైనరీలు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేస్తుంటాయి. కానీ, చైనాలో రిఫైనరీలకు మెయింటెనెన్స్ తప్పనిసరి. ఫలితంగా భారత్ అధికంగా కొనుగోలు చేస్తే లబ్ధిపొందుతుంది. ఈ సీజన్లో ఐరోపాకు భారత డీజిల్ ఎగుమతులు కూడా 137శాతం పెరిగి రోజుకు 2,42,000 బ్యారెళ్లకు చేరాయి.

# నెతన్యాహూ జాగ్రత్త..

- ఖతార్ మా మిత్ర దేశం.. వారి జోలికి మాత్రం వెళ్లొద్దు
- ఇజ్రాయెల్‌కు ట్రంప్ వార్నింగ్



**యూఎస్ :** గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు దోహాలో సమావేశమైన హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని.. దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలని ఆ దేశ ప్రధాని నెతన్యాహును హెచ్చరించారు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీని అద్భుతమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దని అన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి యూఎస్ ప్రతిపాదన మేరకు ఇటీవల దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. మధ్యవర్తిత్వ సూత్రంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. కాగా భారత్‌తో సహా పలు దేశాలు ఈ దాడులను ఖండించాయి. మరోవైపు- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. గాజా సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఇజ్రాయెల్ అధికారుల్ని అడిగేందుకు ఆయన అక్కడికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తాము చేసిన దాడులను సమర్థించుకున్నారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను.. అమెరికా లో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆయన ఓ వీడియోలో మాట్లాడారు. హమాస్‌తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ.. నాడు యూఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. దాడులకు కారణమైన ఉగ్రవాదులు ఏ దేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా ఏ విధంగా చెప్పిందో.. ప్రస్తుతం తాము కూడా అదే చేశామని అన్నారు.

## ఏకపక్షంగా వేధించేందుకే
# అమెరికా ఆర్థిక బలప్రదర్శన

- వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే ప్రతిచర్యలు చేపడతాము
- తీవ్రంగా హెచ్చరించిన చైనా



**తమతోపాటు పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాటిపై నాటో, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా పిలుపునివ్వడంపై చైనా తీవ్రంగా స్పందించింది. కేవలం ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శనకు ఇటువంటి చర్యలు చేపడుతోందని ఆరోపించింది. వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే మాత్రం తాము ప్రతిచర్యలు చేపడతామని తీవ్రంగా హెచ్చరించింది. ఓ పక్క స్పెయిన్ మాడ్రిడ్‌లో సోమవారం నుంచి ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు మొదలైన వేళ చైనా నుంచి ఈ ప్రతి స్పందన రావడం గమనార్హం.**

**చైనా :** రోజు వారీ సాధారణ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లిన్ జిన్ మాట్లాడుతూ ప్రపంచంలోని ఇతర దేశాల వలే రష్యాతో కూడా తమకు సాధారణ సంబంధాలున్నాయన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు." అమెరికా చర్యలు ఏకపక్ష వేధింపులు.. ఆర్థిక బలప్రదర్శనకు నిదర్శనం. ఇవి తీవ్ర స్థాయిలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను దెబ్బతీస్తాయి. అంతేకాదు.. ప్రపంచ వాణిజ్య, పారిశ్రామిక పంపిణీ వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుంది. భయపెట్టడం, ఒత్తిడి చేయడం వంటివి సమస్యలను పరిష్కరించలేవని ఎప్పుడో నిరూపితమైంది. ఉక్రెయిన్ విషయంలో చైనా విధానం ఎప్పుడూ ఒక్కటే. కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఆచరణయోగ్యమైన పరిష్కార మార్గం లభిస్తుంది" అని పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలను చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఐరోపా, అమెరికా ఇప్పటికే రష్యాతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయని గుర్తు చేశారు. ఇక తమ, రష్యా సంస్థల మధ్య సహకారం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందన్నారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రో లియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా ట్రంప్ సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్..

### విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్



**యూఎస్ :** అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యూఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ట్రంప్ అధికారం లోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబి స్తున్నారు. వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణకొరియా వాసులు అక్రమంగా పని చేస్తున్నారన్న సమాచారం ఆధారంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు. ఇది రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు.
ఈనేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారు చేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

## చట్టవిరుద్ధంగా ఉంటే.. 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తాం

### ఈసీకి 'సుప్రీం' హెచ్చరిక



**న్యూఢిల్లీ :** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్ అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్తానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేకపోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికే ఈ విషయంలో ఆధారాలను ప్రజలముందుకు తీసుకువచ్చామని..త్వరలో మరిన్ని ఆధారాలతో ఈసీ చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను బయటపెడతామని హెచ్చరించారు.

## ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. ఇరాన్‌లో భారతీయుడికి చిత్రహింసలు



**కేరళ :** ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసింది. రూ.20 లక్షలు చెల్లించి అతడిని విడిపించుకున్నామని బాధిత కుటుంబం మీడియాకు తెలిపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన బాధితుడు హిమాన్షు మాథుర్ ఉద్యోగం కోసం తొలుత అమన్ రాఠీని కలిశాడు. హరియాణాలోని కర్నాల్‌లో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ తనను తాను పరిచయం చేసుకున్నాడు. కంటిన్యూస్ డిశ్చార్జ్ సర్టిఫికెట్ కోర్సు చేస్తే షిప్పింగ్ జాబ్ వస్తుందని అమన్, మాథుర్‌ను నమ్మించాడు. దాంతో ఆస్ట్రేలియాలో వర్క్ వీసాకు మార్గం సుగమం అవుతుందని చెప్పాడు. ఈ మాటలు నమ్మి మాథుర్ నోయిడాలో కోర్సు కూడా పూర్తిచేశాడు. ఆగస్టు ప్రారంభంలో మళ్లీ అమన్, మాథుర్‌ను సంప్రదించాడు. తాను ఇండోనేసియాలో ఉన్నానని, రూ.19 లక్షలకు వీసా ఇవ్వడానికి ఓ ఏజెంట్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. దీంతో మాథుర్ దిల్లీ నుంచి బయల్దేరి జకార్తా వెళ్లాడు. అక్కడ పానిపట్‌కు చెందిన మరో వ్యక్తి విశాల్‌ను కలుసుకున్నాడు. ఆగస్టు 9న కర్నాల్‌కు చెందిన తమ మనిషి వస్తాడని, అతడికి రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. మిగిలిన రూ.7 లక్షలు తర్వాత ఇవ్వమని చెప్పారు. మూడు వారాల తర్వాత మాథుర్, అమన్, విశాల్ జకార్తా నుంచి దిల్లీకి తిరిగొచ్చారు. ఒప్పందం మేరకు ఆగస్టు 29న అమన్‌తో కలిసి మాథుర్ టెహ్రాన్ బయల్దేరాడు. అక్కడి నుంచి ఆస్ట్రేలియా కు పంపిస్తారేమోనని అతడు భావించాడు. అయితే, అనూహ్యంగా వీరిని ఓ గ్యాంగ్ కిడ్నాప్ చేసి చాబహార్ తీసుకెళ్లింది. మాథుర్‌ను అక్కడ పరిచయం చేసుకున్న ఏజెంట్ మిథు కూడా ఆ కిడ్నాప్ గ్యాంగ్‌లో ఓ భాగమని పోలీసులు తెలిపారు.



# శరవేగంగా పెద్ది సినిమా షూటింగ్

## దసరాకు మ్యూజికల్ సింగిల్ విడుదలకు సన్నాహాలు



గేమ్ ఛేంజర్ సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్ట్స్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా పెద్ది నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీక్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు గేమ్ ఛేంజర్ ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం వాల్తేరు వీరయ్య తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# దుల్కర్ మూవీలో పూజాహెగ్డే

## తాజాగా రమ్యకృష్ణ నటిస్తున్నట్లు ప్రకటన



మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ ఇటీవలే కొత్త తెలుగు సినిమాను ప్రకటించాడని తెలిసిందే. దక్యూ41 వర్కింగ్ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమాను టాలీవుడ్ లీడింగ్ బ్యానర్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో పొడుగుకాళ్ల సుందరి పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇటీవలే ప్రకటించారు. కాగా మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. మరో స్టార్ రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. రమ్యకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ విషయాన్ని ప్రకటించారు. బాహుబలి ఫ్రాంచైజీలో శివగామి లాంటి పవర్ ఫుల్ రోల్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది రమ్యకృష్ణ. ఇంతకీ రమ్యకృష్ణ ఈ ప్రాజెక్టులో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీతో రవి నేలకుదిటి డైరెక్టర్‌గా పరిచయమవుతున్నాడు. ప్రస్తుతం ఉ41 షూటింగ్ దశలో ఉంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ ఇటీవలే విడుదలైన లోక చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. కాగా ఈ బ్యానర్‌లో ప్రస్తుతం నాని నటిస్తోన్న ది ప్యారడైజ్ కూడా ఉంది.

# దూసుకెళ్తున్న మిరాయ్

## రూ. 81.2 కోట్లు గ్రాస్ కలెక్షన్లు



ఈగల్ సినిమా ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో మిరాయ్ అనే సినిమా చేసాడు యంగ్ హీరో తేజ సజ్జా. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న పాన్ ఇండియా భాషలలో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయి బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకెళ్తోంది. తేజ సూపర్ యోధగా మంచు మనోజ్ యాంటోగనిస్టుగా అదరగొట్టారు. అందుకు తగ్గట్టే కలెక్షన్స్ లో మిరాయ్ దూసుకెళ్తోంది. భారీ హైప్ తో రిలీజ్ అయిన మిరాయ్ మొదటి రోజు వరల్డ్ వైడ్ గా రూ. 27.20 కోట్లు గ్రాస్ రాబట్టి సూపర్ స్టార్ట్ అందుకుంది. రెండవ రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో టైర్ 2 హీరోల సినిమాల కంటే ఎక్కువ వసూళ్లు చేసి ఆల్ టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ఇక వరల్డ్ వైడ్ గా శని, ఆదివారం వీకెండ్ దానికి తోడు బ్లాక్ బస్టర్ మౌత్ టాక్ తో ఎక్కడ చూసిన హౌస్ ఫుల్ బోర్డ్స్ పెట్టింది. రిలీజ్ అయిన తొలి మూడు రోజులకు గాను వరల్డ్ వైడ్ గా రూ. 81.2 కోట్లు గ్రాస్ రాబట్టి సెన్సేషనల్ క్రియేట్ చేసింది. ఓవర్సీస్ లోను మిరాయ్ దుమ్ములేపుతోంది. కేవలం నార్త్ అమెరికాలో 10.7 మిలియన్ వసూళ్లు చేసి 2 మిలియన్ కు దూసుకెళ్తోంది. లాంగ్ రన్ లో 3 మిలియన్ డాలర్స్ వసూలు చేస్తుందని ట్రేడ్ అంచనా వేస్తుంది. తెలుగు స్టేట్స్ లోను బ్రేక్ ఈవెన్ దాటి లాభాల బాటలో పయనిస్తున్న మిరాయ్ ఫైనల్ రన్ లో బయ్యర్స్ కు నిర్మాతలకు భారీ లాభాలు తెచ్చిపెట్టనుంది.

# 77వ ఎమ్మీ అవార్డుల ప్రకటన

అంతర్జాతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 77వ ఎమ్మీ అవార్డుల వేడుక లాస్ ఏంజెలెస్‌లోని పికాక్ థియేటర్ వేదికగా అత్యంత వైభవంగా జరిగింది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. ఎమ్మీ అవార్డులు అనేవి అమెరికన్ టెలివిజన్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వాటికి ఇచ్చే ప్రత్యేక గౌరవం. ఈ అవార్డులని అకాడమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రతి సంవత్సరం ఇస్తూ వస్తుంది. ఈసారి నామినేషన్ల బరిలో ఎన్నో సినిమాలు, సిరీస్‌లు పోటీ పడ్డాయి. అందులో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన అడాలేసెన్స్ ఘన విజయం సాధించి ఏకంగా 5 అవార్డులు సొంతం చేసుకోవడం విశేషం. ఇక ఇందులో నటించిన ఓవెన్ కూపర్, చిన్న వయసులోనే ఎమ్మీ అవార్డు గెలుచుకుని కొత్త రికార్డు సృష్టించాడు. ఈ వేడుకలో 20242025 సీజన్‌లో ప్రసారమైన కార్యక్రమాలకి అవార్డులని అందించారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమైన అడోలెసెన్స్, ఆర్యేన్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్ అవార్డులని దక్కించుకున్నాయి.

# సంస్కారం లేని వార్తలు ప్రచారం

## జగపతి బాబు టాక్‌షోలో నటి మీనా ఆవేదన

చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా జగపతిబాబుతో ఆమె జయమ్ము నిశ్చయమ్మురా కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో జీ 5 లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేదని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా మూకుతి అమ్మన్ 2లో నటిస్తున్నారు. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్క రించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. జగపతిబాబు నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు తాను వెళ్లాల్సిఉందని కాకపోతే షూటింగ్ కారణంగా కుదరక వెళ్లలేదన్నారు.





# సపోర్ట్ లేకుంటే రాణించడం కష్టమే

## నటి ప్రియాంక చోప్రా మనోగతం

చిత్రసీమలో బ్యాక్ గ్రౌండ సపోర్టు లేకుండా రాణించడం కష్టమే అని నటి ప్రియాంక చోప్రా అభిప్రాయ పడ్డారు. 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడించారు. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న వారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నించడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించానని ప్రియాంక తెలిపారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. 2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను.ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ 29లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.

# ఈ విజయం భారత్ సైన్యానికి అంకితం

## టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ ప్రకటన



దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ 2025 మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై చిరస్మరణీయ విజయాన్ని సాధించింది. ఈ విజయం పై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సంతృప్తిని వ్యక్తం చేశాడు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో బాధితులు, కుటుంబాలకు ఆయన నివాళులర్పించారు. భారత సాయుధ దళాలకు సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్‌పై సాధించిన విజయాన్ని భారత్ ఆర్మీ ధైర్యసాహసాలకు అంకితం చేశారు. జట్టు ప్రదర్శన వారికి గర్వకారణంగా ఉంటుందని ఆకాంక్షించారు. ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. సరైన సందర్భం, సమయాన్ని వెచ్చించి, పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు మేము అండగా నిలుస్తాము.మేము మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. చాలా ధైర్యసాహసాలు ప్రదర్శించిన మా సాయుధ దళాలన్నింటికీ ఈ విజయాన్ని అంకితం చేయాలనుకుంటున్నాము. వారు మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటారని ఆశిస్తున్నాను. వారి ఆనందం కోసం మాకు అవకాశం దొరికినప్పుడల్లా మైదానంలో అలరిస్తూనే ఉంటాం అని భారత కెప్టెన్ సూర్యకుమార్ కామెంట్స్ చేశాడు.సూర్యకుమార్ విజయాన్ని ప్రతిబింబిస్తూ, ఈ గెలుపు దేశానికి సంపూర్ణమైన రిటర్న్ గిఫ్ట్‌గా అభివర్ణించాడు.పాకిస్తాన్‌పై ఆధిపత్యం చెలాయించిన భారత కెప్టెన్ జట్టును అద్భుతంగా నడిపించాడు. సూర్యకుమార్ 37 బంతుల్లో అజేయంగా 47 పరుగులు చేసి, ఏడు వికెట్లు చేతిలో ఉండగా కేవలం 15.5 ఓవర్లలో 128 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి భారత్‌లో స్ఫూర్తిని నింపాడు. ప్రత్యర్థి ఎవరనేది సంబంధం లేకుండా, జట్టు కోసం ప్రతి మ్యాచ్‌ను గెలిచేలా సిద్ధంగా ఉండటం, ఫోకస్డ్‌గా స్థిరంగా ఉండటమే తమ ప్రాముఖ్యత అని భారత కెప్టెన్ నొక్కి చెప్పాడు.స్పిన్నర్ల పాత్రను హైలైట్ చేస్తూ, మిడిల్ ఓవర్లలో వారి చేసే పని ఆటకు టోన్‌ను మార్చేస్తుందని అన్నాడు. కుల్దీప్ యాదవ్ గేమ్ ప్లాన్‌కు కట్టుబడి ఉండటం వల్లే అద్భుతం చేయగలిగాడని ప్రశంసించాడు. భారత స్పిన్ త్రయం కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి అద్భుతమైన స్పెల్‌తో పాకిస్తాన్ బ్యాటింగ్ లైనప్‌ను ఛేదించారు. వారిని 20 ఓవర్లలో 127/9కి పరిమిత చేశారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అభిషేక్ శర్మ భారత్‌కు మంచి ఆరంభాన్ని అందించాడు.బౌండరీలు, సిక్సరలుతో విరుచుకుపడ్డాడు. ఓ దశలో టాప్‌ఆర్డర్ వికెట్లు పడిపోయిన తర్వాత కూడా, సూర్యకుమార్ యాదవ్ తిలక్ వర్మ మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను సులభంగా విజయం దిశగా నడిపించారు. ఈ విజయం మైదానంలో విజయం కంటే ఎక్కువ. ఆపరేషన్ సిందూర్ తర్వాత రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వచ్చిన ఈ విజయం మెన్ ఇన్ బ్లూకు మరింత స్పెషల్‌గా చెప్పవచ్చు. భారత్‌పై భారీ స్కోరు నమోదు చేయాలనే టార్గెట్‌తో పాకిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. వికెట్లు తీస్తూ, డాట్ బాల్స్ వేస్తూ పాకిస్తాన్‌ను ఎక్కువ టైం సైలెంట్‌గానే ఉంచింది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఎక్కువ పరుగులు ఇవ్వకుండా క్రమం తప్పకుండా వికెట్లు తీసుకున్నారు. సైమ్ అయూబ్ చేతిలో మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ భారత్ తన లక్ష్యాన్ని ఈజీగానే ఛేదించింది. తొలి బంతి నుంచే పాకిస్తాన్ బౌలర్లపై భారత్ బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో పాకిస్తాన్‌పై భారత్ పై చేయిసాధించింది.



## ఒకే మ్యాచ్‌లో 9 వికెట్లు..

### ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా మహ్మద్ సిరాజ్

భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఆగస్టు నెలకుగాను ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ, వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్‌ను వెనక్కినెట్టి ఈ అవార్డు దక్కించుకున్నాడు. ఆగస్టులో సిరాజ్ ఒకే టెస్టు ఆడినా అదిరే ప్రదర్శన చేశాడు. అండర్సన్–తెందూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో భారత్ ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2–2తో సమం చేసింది. ఆ మ్యాచ్‌లో భారత్ గెలవడంలో సిరాజ్‌దే కీలకపాత్ర. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 46 ఓవర్లు బౌలింగ్ చేసిన ఈ హైదరాబాదీ పేసర్ 9 వికెట్లు పడగొట్టాడు. సెకండ్ ఇన్నింగ్స్‌లో తీవ్రమైన ఒత్తిడిలోనూ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు దక్కడంపై సిరాజ్ సంతోషం వ్యక్తం చేశాడు. "ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపిక కావడం ఒక ప్రత్యేక గౌరవం. అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ ఒక చిరస్మరణీయ సిరీస్. నేను ఆడిన అత్యుత్తమ సిరీస్‌ల్లో ఇది ఒకటి. ముఖ్యంగా కీలకమైన సమయాల్లో వికెట్లు తీసి జట్టు విజయానికి దోహదపడినందుకు గర్వపడుతున్నాను.ఈ అవార్డు నాకెంత ముఖ్యమైందో నా సహచరులకు, సహాయక సిబ్బందికి కూడా అంతే విలువైనది. ఎందుకంటే వారి నిరంతర ప్రోత్సాహం, నమ్మకం నన్ను ముందుకు నడిపించాయి" అని పేర్కొన్నాడు.



## విరాట్‌ను వెనక్కి నెట్టిన అభిషేక్

### పాక్‌పై తొలి భారత క్రికెటర్‌గా రికార్డు..

సంచలనాలు సృష్టించే పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు టీమ్‌ఇండియా షాక్ ఇచ్చింది. లక్ష్యం చిన్నదైనా కాపాడుకొనేందుకు పాక్ చివరివరకూ పోరాడుతుంది. అయితే, ఆ టీమ్‌కు అవకాశం ఇవ్వకుండా భారత్ ఆధిపత్యంతో అదరగొట్టింది. అన్ని రంగాల్లోనూ పట్టుబిగించి విజయం సాధించింది. తొలుత బౌలింగ్‌లో విజృంభించిన భారత్ ప్రత్యర్థి పాక్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసింది. అనంతరం స్టార్ పేసర్ షహీన్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కొంటుందా? అనే అనుమానాలను భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ పటాపంచలు చేశాడు. వచ్చీ రావడంతోనే దూకుడుగా ఆడేశాడు. ఈక్రమంలో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లిని వెనక్కి నెట్టాడు. ఆసియా కప్ గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. పాక్ నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా మరో 25 బంతులు మిగిలిఉండగానే ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31: 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) వేగంగా ఆడేశాడు. దీంతో పాక్‌పై పవర్ ప్లేలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఆ ఘనత విరాట్ పేరిట ఉండేది. దుబాయ్ వేదికగానే 2022లో విరాట్ కోహ్లి 29 పరుగులు చేశాడు. అదే ఏడాది రోహిత్ శర్మ కూడా 28 పరుగులు రాబట్టాడు. భారత్ తరఫున అభిషేక్ టాపర్ కాగా.. ఓవరాల్‌గా మాత్రం పాక్ మాజీ ఆటగాళ్లు నసీర్ జంషెడ్ (2012లో 34 రన్స్), ఇమ్రాన్ నజీర్ (2007లో 33 పరుగులు) ముందున్నారు. భారత్–పాక్ మధ్య జరిగిన తొమ్మిది టీ20 మ్యాచుల్లో ఛేదనకు దిగిన జట్టు గెలవడం ఇది ఎనిమిదోసారి. న్యూయార్క్‌లో గత పొట్టి కప్‌లో మాత్రమే మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ విజయం సాధించింది.

# అదేమీ రూల్ కాదు..

## షేక్‌హ్యాండ్‌పై పాక్‌కు బీసీసీఐ కౌంటర్

ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించిన టీమ్‌ఇండియా ఆటగాళ్లు నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్‌దీప్ యాదవ్‌తోపాటు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రమే పోస్ట్ ప్రెజెంటేషన్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పాక్ నుంచి ఎవరూ రాలేదు. అయితే, తమతో టీమ్‌ఇండియా ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడంపై ఏసీసీ వద్ద పాక్ ప్రతినిధులు నిరసన తెలిపారని.. ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. వీటికి కౌంటర్ ఇచ్చేలా భారత క్రికెట్ బోర్డు అధికారి స్పందించారు. పీటీఐతో మాట్లాడిన సదరు సీనియర్ అధికారి పాక్ ఫిర్యాదుకు విలువ లేదని వ్యాఖ్యానించారు. "మీకు ఏదైనా సందేహం ఉంటే ఓసారి రూల్ బుక్‌ను చూసుకోండి. సరిగ్గా చదివితే.. అందులో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వాలని ప్రత్యేకంగా ఏమీలేదు. అదంతా గుడ్‌విల్ మీద ఆధారపడి ఉంటుంది. స్నేహపూర్వకంగా ఉన్నప్పుడు చేస్తారు. అంతేకానీ, ఇదేమీ చట్టం కాదు. కాబట్టి, భారత క్రికెటర్లు ప్రత్యేకంగా వాళ్లతో కరచాలనం ఇవ్వాల్సిన అవసరం లేదు" అని అధికారి పేర్కొన్నారు.

### ప్రెస్ కాన్ఫరెన్స్ నుంచి టీమ్ షీట్ల మార్పిడి వరకూ..

ఆసియా కప్ ప్రారంభానికి ముందు ఎనిమిది జట్ల కెప్టెన్లతో ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగింది. భారత్, పాక్ సారథులు సూర్యకుమార్, సల్మాన్ అఘా పక్కపక్కన కూర్చోలేదు. మధ్యలో అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ ఉన్నాడు. పీసీ ముగిసిన తర్వాత సల్మాన్‌తో సూర్య కరచాలనం చేశాడు. ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్న మోసిన్ ఖాన్‌తో షేక్ హ్యాండ్ ఇచ్చాడు. దీంతో భారత అభిమానుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దీంతో మ్యాచ్ రోజున టాస్ తర్వాత ఇచ్చే టీమ్ షీట్ల విషయంలోనూ స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది.




సాధారణంగా ఇరు జట్ల సారథులు జాబితాను ఇచ్చిపుచ్చుకొనేవారు. కానీ, ఈసారి మాత్రం రెండు షీట్లను రిఫరీకి ఇవ్వడం గమనార్హం. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందే.

### మ్యాచ్ రిఫరీని తొలగించాలని పీసీబీ ఫిర్యాదు

మరోవైపు.. భారత్, పాక్ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన ఆండీ పైక్రాఫ్ట్‌ను ఆసియా కప్ నుంచి వెంటనే తొలగించాలని పాక్ క్రికెట్ బోర్డు డిమాండ్ చేసింది. ఆండీ పైక్రాఫ్ట్ ఐసీసీ ప్రవర్తనా నియమావళి, క్రికెట్ స్ఫూర్తికి సంబంధించిన ఎంసీసీ చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించింది. ఈ మేరకు పీసీబీ, ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు. 'ఐసీసీ ప్రవర్తనా నియమావళి, క్రికెట్ స్ఫూర్తికి సంబంధించిన ఎంసీసీ చట్టాలను మ్యాచ్ రిఫరీ ఉల్లంఘించినందుకు పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీకి ఫిర్యాదు చేసింది. ఆసియా కప్ నుంచి మ్యాచ్ రిఫరీని వెంటనే తొలగించాలని పీసీబీ డిమాండ్ చేసింది' అని మోసిన్ నఖ్వీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# 'పాక్‌తో ఆడటం భారత క్రికెటర్లెవరికీ ఇష్టం లేదు'

ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడటం భారత క్రికెటర్లకు అస్సలు ఇష్టంలేదని మాజీ ఆటగాడు సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. బాయ్‌కాట్ చేయాలంటూ పెద్దఎత్తున డిమాండ్లు వచ్చినా టీమ్‌ఇండియా మాత్రం పాక్‌తో తలపడి అద్భుత విజయం సాధించింది. ఆ మ్యాచ్ ఫలితాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధితులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించిన సూర్యకుమార్ యాదవ్‌పై అభిమానుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. అలాగే పాక్ ప్లేయర్లతో కరచాలనం చేయకుండా ఉండటం మంచిది అయిందన్న వ్యాఖ్యలు వినిపించాయి. అసలు ఆ జట్టుతో ఆడటమే మన క్రికెటర్లకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని రైనా చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. "నేనొక విషయం కచ్చితంగా చెప్పగలను అనుకుంటున్నా. మీరు మన ఆటగాళ్లను వ్యక్తిగతంగా తమ అభిప్రాయాలను అడిగితే చెబుతారు. ఆసియా కప్‌లో పాక్‌తో ఆడాలని ఉందా? లేదా? అనే ప్రశ్నకు లేదనే బదులిస్తారు. బీసీసీఐ వల్లే వారు అంగీకరించారు. పాక్‌తో ఆడటం నన్ను బాధించింది. విజయం సాధించడం ఆనందమే కానీ.. అసలు ఆడకుండా ఉండుంటే ఇంకా బాగుండేది" అని సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు.



### అప్పటి పాక్ జట్టు లాంటిది కాదు : గావస్కర్

పాకిస్థాన్ టీమ్ నాణ్యతపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తాను చూసిన అత్యంత చెత్త జట్లలో ఇదొకటిగా పేర్కొన్నాడు. "నేను పాక్ క్రికెట్‌ను 1960ల నుంచి గమనిస్తూనే ఉన్నా. చర్చిగేట్ స్టేషన్ నుంచి వాంఖడే మైదానానికి వెళ్లేటప్పుడు హనీఫ్ మహ్మద్ ఫొటోలు ఉండేవి. చాలా గొప్ప క్రికెటర్లు ఉండేవారు. ఇప్పుడు తొలిసారి పాక్ టీమ్ చాలా బలహీనంగా కనిపిస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు.

# తండ్రి ఇచ్చిన కిడ్నీతో కొత్త జీవితం..


## ప్రపంచ పోటీల్లో రెండుస్వర్ణాలు

కిడ్నీ మార్పిడి జరిగినా వెనకడుగు వేయకుండా ముంబయికి చెందిన కుర్రాడు ప్రపంచ పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించాడు. జర్మనీలో వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్–2025లో పతకాలు కొల్లగొట్టాడు. భారత్ నుంచి ఈ ఘనత సాధించిన పిన్నవయస్కుడిగా చరిత్ర సృష్టించారు. మహారాష్ట్రలోని హీరానందాని స్కూల్‌లో 9వ తరగతి చదువుతోన్న ఇషాన్ అనేకర్‌కు 10 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు కిడ్నీ సమస్య తలెత్తింది. తండ్రి కిడ్నీ ఇవ్వడంతో మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించాడు. చిన్న వయసులోనే ప్రాణగండాన్ని దాటిన అతడు.. తనకెంతో ఇష్టమైన స్విమ్మింగ్ వైపు మళ్లీ దృష్టిసారించాడు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటూ కఠిన శిక్షణ తీసుకున్నాడు. ఇటీవల జర్మనీలోని డ్రెస్డెన్‌లో జరిగిన ఈత పోటీల్లో 100మీ ఫ్రీస్టైల్, 200 మీ ఫ్రీస్టైల్‌లో స్వర్ణాలు సాధించాడు. 50మీ బటర్‌ఫ్లైలో వెండినీ సొంతం చేసుకున్నాడు. ఇక్కడ మరో విశేషం ఏంటంటే.. ఇషాన్ తండ్రి అనంత్ కూడా ఈ క్రీడల్లో పాల్గొన్నాడు. డాట్స్, పెంటాక్ గేమ్స్‌లో రెండు వెండి పతకాలు సొంతం చేసుకున్నాడు. వాళ్లిద్దరు భారత్‌కు ఐదు మెడల్స్ తెచ్చిపెట్టారు. ఈ వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌కు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ గుర్తింపు ఉంది. ట్రాన్స్‌ప్లాంట్ వల్ల ప్రాణాలతో బయటపడినవారిని ప్రోత్సహించేందుకు, అవయవదానం పట్ల అవగాహన కల్పించేందుకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వీటిని నిర్వహిస్తుంటారు. ఈసారి ఆగస్టు 17 నుంచి 24 మధ్య డ్రెస్డెన్‌లో జరిగిన ఈ పోటీల్లో 60 దేశాల నుంచి 1600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. భారత్ తరఫున 49 మంది ప్రాతినిధ్యం వహించగా.. 16 స్వర్ణాలతో కలిపి 63 పతకాలను దక్కించుకున్నారు.



# దేశానికి ఎల్లప్పుడూ గర్వకారణంగా ఉండేలా జట్టు కృషి

### భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్



ఆసియా కప్ 2025లో భాగంగా ఆదివారం దుబాయ్ వేదికగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ సమరం జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా పాకిస్థాన్ జట్టు చిత్తుగా ఓడించింది. భారత జట్టు 7 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని తన సొంతం చేసుకుంది. ఈ విజయంతో టీమిండియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. టీమిండియా ఆటగాళ్ల ఆట తీరు పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం ఓ కొత్త వివాదం మొదలైంది. భారత జట్టు విజయం సాధించిన వెంటనే బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్, శివం దూబే సహా ఏ ఇతర భారత ఆటగాడు కూడా పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయడానికి ముందుకు రాలేదు. దీంతో పాకిస్థాన్ జట్టు మైదానాన్ని విడిచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ ఓ కీలక ప్రకటన చేశారు.గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. ఈ విజయం కేవలం ఒక మ్యాచ్‌లో గెలుపు మాత్రమే కాదని.. దీని వెనుక ఒక ప్రత్యేక కారణం ఉందని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పహల్గాం దాడిలో అమరులైన వారి కుటుంబాలకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా.. భారత సాయుధ బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌కు కృతజ్ఞతలు చెప్పాలనుకున్నామని పేర్కొన్నారు. దేశానికి ఎల్లప్పుడూ గర్వకారణంగా ఉండేలా జట్టు కృషి చేస్తుందని గౌతమ్ గంభీర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలతో భారత ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తి కన్నా దేశభక్తికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని స్పష్టమైంది. ఈ విజయం భారత జట్టుకు సూపర్ 4లో స్థానాన్ని దాదాపుగా ఖాయం చేసింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే పాకిస్థాన్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 127 పరుగులే చేయగలిగింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ అత్యుత్తమంగా రాణించి 4 ఓవర్లలో 18 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. 128 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన టీమిండియా కేవలం 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి సునాయాసంగా గెలిచింది.

# పాకిస్థాన్ పనికి మాలిన జట్టు

### సునీల్ గవాస్కర్ విమర్శలు

భారత్ చేతిలో చిత్తయిన పాకిస్థాన్ జట్టుపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ విమర్శలు గుప్పించాడు. ప్రస్తుత పాకిస్థాన్ జట్టు పనికి మాలిన టీమ్ అని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్ 2025లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా చెలరేగిన భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. భారత బౌలర్ల ధాటికి 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులే చేసింది. భారత స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయిన పాక్ బ్యాటర్లు మొత్తం 63 డాట్ బాల్స్ ఆడారు. ఓ దశలో పాకిస్థాన్ 100 పరుగుల్లోపే ఆలౌటయ్యేలా కనిపించింది. చివర్లో షాహీన్ షా అఫ్రిది దూకుడుగా గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలోనే ఛేదించింది.ఈ మ్యాచ్ అనంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన గవాస్కర్.. పాకిస్థాన్ ఆట ఆ జట్టు స్థాయికి తగ్గట్లు లేదన్నాడు. అజయ్ జడేజా, వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్ పఠాన్ నాతో ఏకీభవిస్తారో లేదో తెలియదు. కానీ నేను 1960 నుంచి పాకిస్థాన్ జట్టును గమనిస్తున్నాను. హనీఫ్ మొహమ్మద్ వంటి గొప్ప ఆటగాడిగా చూడటానికి నేను చర్చ్‌గేట్ స్టేషన్ నుంచి వాంఖడే స్టేడియం వరకు పరుగెత్తిన జ్ఞాపకాలు నాకు ఉన్నాయి. అప్పటి నుంచి పాకిస్థాన్ క్రికెట్‌ను నేను నిశితంగా చూస్తున్నాను. కానీ ఈ రోజు మొదటిసారి ఇది పాకిస్థాన్ జట్టు కాదనిపించింది. ఇదో పనికిమాలిన జట్టులా అనిపించింది.'అని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. గవాస్కర్ వ్యాఖ్యలతో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ ఏకీ భవించాడు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌ను రీడ్ చేయడంలో పాకిస్థాన్ యువ బ్యాటర్లు విఫలమయ్యారని చెప్పాడు. 63 బంతులు డాట్ చేశారని, అక్కడే మ్యాచ్ పోయిందని అభిప్రాయపడ్డాడు.



# పాలకులు అధికార దాహం వీడాలి

దేశంలో దాదాపు ఏడెనిమిదేళ్ల పాటు జిఎస్టీతో వాతలు పెట్టిన మోడీ ప్రభుత్వం ఇప్పడు, అందులో కొంత తగ్గించి నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు అంటోంది. ఆషాడం సేల్ లాగా తగ్గించి అమ్ముకోవడం అన్నది గుర్తుకు వస్తోంది. నిజానికి జిఎస్టీ ప్రకటించినప్పడు అతిపెద్ద సంస్కరణగా అభివర్ణించారు. ఇప్పడేమో రాబోయే తరం కోసం సంస్కరణ అంటున్నారు. ఇంతకాలం నెత్తీనోరు మొత్తుకున్నా జిఎస్టీ తగ్గించలేదు. ఇన్సూరెన్స్‌లపైనా జిఎస్టీ విధించారు.

**దాదాపు 11 ఏళ్ల తరవాత ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ.. వారు అలా చేశారని..ఇలా చేశారని విమర్శిస్తూ పాలన సాగించడం సిగ్గుచేటు. జిఎస్టీ తగ్గింపులే కాదు...నిరుద్యోగ సమస్యకు కూడా పరిష్కారం చూపాలి. అలాగే ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి. యూరియ కొరతతో రైతులు నానా అగచాట్ల పడుతున్నా, వారు తిరుగుబాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదో హెచ్చరికగా చూడాలి. రైతాంగం పట్ల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చూడాలి. ధరలను అదుపు చేయడం, నిరుద్యోగం లేకుండా చూడడం, పండించిన ధాన్యం లేదా వ్యవసాయ ఉత్పత్తులు కొనేలా మార్కెట్ సౌకర్యం కల్పించడం చేయాలి. బంగారం ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ కారణాలు చూపి తప్పించుకోకుండా ఎందుకిలా పెరుగుతున్నాయో విశ్లేషించాలి. అలాగే రాజకీయ పెత్తనం తగ్గాలి. రాజకీయంగా ఎంపిలు, ఎమ్మెల్యలే జీతభత్యాలు తగ్గాలి.**



ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం 45 లక్షల మధ్య నెలవారీ చెల్లింపులు అధికంగా భావించాలి. డబుల్ పెన్షన్లు వెంటనే ఆగాలి. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఖర్చులు తగ్గించు కోవాలి. ఆస్తులు అమ్ముకోవడం ద్వారా ఆస్తులు సమకూర్చాలన్న భవన సరికాదు. పొరుగుదేశాల్లో ఆందోళనలు కనువిప్పు కావాలి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు కారణాలు తెలుసుకుని మనవద్ద కూడా అలాంటివి జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చిన్నదేశాల్లో అస్థిరతకు విదేశీ హస్తం కూడా కారణం ఉండవచ్చు. అయితే ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండడం వల్లనే తిరుగుబాట్లు వస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో విదేశీ శక్తి కూడా తోడవుతుండవచ్చు. ఎందుకంటే ధరలు, అణచివేత, నిరుద్యోగం, రైతుల సమస్యలు ఇత్యాదివన్నీ ప్రజల్లో ఆందోళనకు కారణంగా చూడాలి. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. ఇప్పుడు మోడీ కూడా పదేపదే కాంగ్రెస్‌ను బూచిగా చూపి తప్పించుకో జూస్తున్నారు. కేసులే అపరిష్కృ తంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందన్నది పాలకులు ఆలోచన చేయాలి. నేపాల్‌లో కేవలం ఒక్క కారణంతోనే తిరుగబాటు రాలేదు. ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉంది.అనేక అంశాలు ఇందుకు తోడయ్యాయి. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగు బాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మాత్రం బాగుపడలేదు. గతంలో విప్లవాలన్నీ పాలకులు అవినీతి, అక్రమాలు,నిరంకుశంపైనే వచ్చాయి. మనదవేశంలో రోజువారీ కేసులన్నీ రాజకీయాల కు సంబంధించినవిగానే ఉంటున్నాయి. వాటి చుట్టే కోర్టు తీర్పులు తీరుగుతు న్నాయి. అనేక కేసుల్లో న్యాయం దక్కడం లేదన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఇవన్నీ కూడా మననం చేయాలి. సమీక్షించాలి. అందువల్ల న్యాయ వ్యవస్థపైనా ఇక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోకుండా భరోసా నింపాలి. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్..బంగ్లాదేశ్ దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ వ్యవస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం ఉన్నాయి. మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరని నమ్మరాదు. రైతుల ఉద్యమాన్ని తక్కువగా చూడరాదు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నేత కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదు. ఎందుకంటే కేంద్ర రాష్ట్రాల్లో విపరీతమైన అవినీతి పెరిగింది. లంచగొండి తనం వేళ్లూనుకుపోయింది. సామాన్యులకు న్యాయం ఎండమావిగా మారుతోంది. అధికార దుర్విని యోగం హద్దుమీరుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతంది. అలాగే రాజకీయా నాయకులు తమ అతిని వదులుకుని ప్రజలకోసం, దేశం కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. లేకుంటే ప్రజాగ్రహం తప్పదు.



**ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సి నంతగా చెందలేదు. రాజకీయ లాలూచీ, అవినీతి కారణంగా దేశం భ్రష్టు పట్టిపోతోంది. రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. వివేకా నందరెడ్డి హత్య జరిగి ఆరేల్లయినా తేల్చలేక పోయారు. సిబిఐ, ఇడి కేసులు కూడా ఏమీ తేల్చడం లేదు. కాళేశ్వరం,ఇకార్ రేసులో అవినీతిని నిగ్గు తేల్చడం లేదు.**



**ఏపనికీ లంచం లేనిదే ఫైలు కదలడం లేదు. రాజకీయ నేతలు విలాసాలకు అలవాటు పడ్డారు. అందుకే ప్రజలు పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతు న్నారు. ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది.అధికారం లక్ష్యంగా సంక్షేమం పేరిట హద్దుమీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు లేదు. ప్రజాధనానికి కాపలా ఉండి కేర్‌టేకర్‌గా పనిచేయాల్సిన వారు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.**

---

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

**"ఋషి తెలుగు దినపత్రిక"**

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

**కాపాడుకుందాం**
**మన దేశాన్ని!**
**మన ధర్మాన్ని!!**

# పితృపక్షాలకు ప్రసిద్ధం ఈ తీర్థం

**ఈ నెలలో పితృపక్షాలు నడుస్తున్నాయి. పితృదేవతలకు తర్పణాలు వదులుతున్నారు. తిథుల ప్రకారం తద్దినాలు పెట్టని వారు ఈ మాసంలో పెద్దలకు బియ్యం ఇస్తుంటారు. పుష్కరాల సమయంలోనూ నదీ తారాల్లోనూ, ప్రత్యేకించి గయలో శ్రాద్దాలుపెడుతారు. కాశీ కూడా ఇందుకు అనువుగా భావిస్తారు. అయితే మరో తీర్థం కూడా ఇందుకు ప్రత్యేకించి ఉంది. మన దేశంలో అనేక ప్రాముఖ్య పుణ్యక్షేత్రాలు, తీర్థయాత్ర స్థలాలు ఉన్నాయి. ఒకొక్క స్థలం ఒకొక్క విశిష్టతని కలిగి ఉంటుంది. అదే విధంగా మన దేశంలో పితృపక్ష సమయంలో ఒక తీర్ధయాత్ర స్థలంలో శ్రాద్ధ కర్మలను నిర్వహించడం.**



తర్పణం విడవడం.. పూర్వీకుల ఆత్మలకు శాంతిని ఇస్తుందని, వారు మోక్షాన్ని పొందుతారని నమ్ముతారు. ఈ ప్రదేశం శతాబ్దాలుగా సంచరిస్తున్న ఆత్మలకు మోక్షానికి మార్గదర్శకంగా పరిగణించబడుతుంది. ఇక్కడే పాండవులు తమ పూర్వీకులకు శ్రాద్ధ కర్మలను నిర్వహించినట్లు స్థల పురాణం..ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో ఉన్న హత్య హరణ తీర్థం,పితృపక్ష సమయంలో ప్రపంచానికి , మరణానంతర జీవితానికి మధ్య దూరాన్ని తొలగిస్తుంది. ఈ పవిత్ర స్థలం పూర్వీకులను ఋణం నుంచి విముక్తి, చేయడమే కాదు సంచరించే ఆత్మలకు శాంతిని, మోక్షాన్ని అందించే తీర్థ యాత్రా స్థలంగా యుగయుగాల కాలం నుంచి ప్రసిద్ధి చెందింది. రామాయణం, మహాభారత కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయాలు ఈ ప్రదేశాన్ని మరింత ముఖ్యమైనవిగా చేశాయి. భూమి మధ్యలో ఉన్న పవిత్ర స్థలం ఈ పుణ్యక్షేత్రం హర్దోయ్ జిల్లాలోని బెనిగంజ్ ప్రాంతంలో ఉంది. ఈ ప్రదేశం భూమి మధ్యలో ఉందని చెబుతారు. పితృపక్ష సమయంలో ఈ ప్రదేశం ప్రపంచానికి , మరణానంతర జీవితానికి మధ్య దూరాన్ని తొలగిస్తుందని నమ్ముతారు. ఇక్కడ చేసే నిర్వహించే శ్రాద్ధ కర్మలు, ప్రార్థనలు నేరుగా పూర్వీకులకు చేరుతాయని నమ్మకం. అందుకే పితృ పక్ష సమయంలో ఈ తీర్థయాత్రా స్థలంలో భారీ రద్దీ నెలకొంటుంది. సంచరిస్తున్న ఆత్మలకు శాంతి, మోక్షం ఇచ్చే ప్రదేశం హర్దోయ్ లోని బెనిగంజ్ ప్రాంతంలో ఉన్న హత్యహరన్ తీర్థం ప్రాముఖ్యత రామాయణం, మహాభారతకాలం నాటిది. వేదాల ప్రకారం ఈ ప్రదేశం ఒకప్పుడు శివుడు తపస్సు చేసిన ప్రదేశం. శివ పురాణం ప్రకారం పార్వతి దేవి దాహం తీర్చడానికి.. శివుడు సూర్య భగవానుడికి అర్ఘ్యం ఇస్తూ.. ఆ నీటి ద్వారా ఒక చెరువును సృష్టించాడు. అప్పుడు పార్వతి దేవి ఈ చెరువులోని నీటిని తాగింది. సూర్య గ్రహణం రోజున దానం చేయడం ఫలవంతం.. వేటిని దానం చేయాలంటే.. మహాభారత యుద్ధం తర్వాత పాండవులు యుద్ధంలో మరణించిన తమ కుటుంబ సభ్యులకు ఇక్కడే తర్పణం ఆచరించారు. ఈ ప్రదేశంలో శ్రద్ధా తర్పణం చేయడం వల్ల అసంతృప్త ఆత్మలకు శాంతి, మోక్షం లభిస్తుందని నమ్ముతారు. అదేవిధంగా అయోధ్యకు తిరిగి వచ్చేటప్పుడు బ్రహ్మహత్యా పాపం నుంచి బయటపడటానికి శ్రీరాముడు కూడా ఈ కుండంలో స్నానమాచరించాడని నమ్మకం. ఆ తర్వాత ఈ ప్రదేశం మోక్షాన్ని అందించే తీర్థయాత్రగా ప్రసిద్ధి చెందింది. నైమిశారణ్యంతో ముడిపడి ఉన్న ప్రాముఖ్యత ఈ తీర్థయాత్ర స్థలం ఋషుల తపస్సు స్థలం అయిన నైమిశారణ్యానికి సమీపంలో ఉంది. ఇది దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. వేదాలు , పురాణాలలో నైమిశారణ్యాన్ని తపస్సు , జ్ఞాన కేంద్రంగా పరిగణిస్తారు. అందువల్ల హత్య హరణ తీర్థం ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాముఖ్యత రెండూ చాలా లోతైనవి. పితృ పక్షంలో విశేష ప్రాముఖ్యత పితృ పక్ష సమయంలో దేశ విదేశాల నుంచి భక్తులు తమ పూర్వీకులకు తర్పణం, శ్రద్ధా కర్మలను చేయడానికి ఇక్కడకు వస్తారు. ఇక్కడ చేసే దానధర్మాలు , స్నానం పూర్వీకుల ఆశీస్సులను ప్రసాదిస్తుందని నమ్ముతారు.చెరువు చుట్టూ ఉన్న పురాతన చెట్లు , రాళ్ళు ఇప్పటికీ ఈ ప్రదేశం ప్రాచీనత, దైవత్వానికి నిదర్శనంగా ఉన్నాయి.

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #115419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 61628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com; Corporate Office : H.No.: 110216/A/15, Lane No 2, Brahminwada, Begumpet, Hyderabad 500016, Telangana